epaper.samayamdaily.net
APTEL/2006/18267
# సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

సమయం
విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 43 | ఎడిటర్ : విక్రం కుమార్ | శుక్రవారం 21 నవంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |

# కేటీఆర్‌కు బిగ్‌షాక్

## ఫార్ములా-కారు రేసు కేసు విచారణకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్



- అనుమతిస్తూ జిష్ణుదేవ్ ఉత్తర్వులు
- ఫార్ములా ఈ-కార్ రేసులో కీలక పరిణామం
- త్వరలో చార్జ్‌షీట్ దాఖలు చేయనున్న ఏసీబీ
- రూ.55కోట్ల బదిలీ వ్యవహారమే కీలకం

**హైదరాబాద్, నవంబర్ 20:** మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు బిగ్‌షాక్ తగిలింది. ఈ ఫార్ములా-కారు రేసు కేసుకు సంబంధించి ఆయనపై విచారణ చేపట్టేందుకు గవర్నర్ అధికారికంగా అనుమతి మంజూరు చేశారు. ఈ కేసులోనిధుల దుర్వినియోగంపై విచారణకు గవర్నర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఏసీబీ త్వరలోనే కేటీఆర్‌పై చార్జ్‌షీట్ దాఖలు చేయనుందని సమాచారం. ప్రభుత్వం ఈ విషయంలో లేఖ రాయడంతో ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో కేటీఆర్‌ను ఏసీబీ విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించారు. ఈ కేసులో ఇప్పటికే పలుమార్లు కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈక్రమంలో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి కోరుతూ గతంలో ఏసీబీ లేఖ రాసింది. మిగతా 3 లో

## సీఎం ఏం చేస్తారో చెప్పాలి



- కేటీఆర్ విచారణకు గర్నవర్ ఆమోదం స్వాగతించాల్సిన విషయం
- బండి సంజయ్

03




## గవర్నర్లు, రాష్ట్రపతికి

# గడువు పెట్టలేం

## గవర్నర్లకు మూడు అంశాల్లోనే నిర్ణయం

సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక తీర్పు

**రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే అంశంలో సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానం గడువు విధించడంపై దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము సంధించిన ప్రశ్నల (ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్)పై అత్యున్నత న్యాయస్థానం సమాధానమిచ్చింది.**

**న్యూఢిల్లీ, నవంబర్ 20:** గవర్నర్, రాష్ట్రపతి అధికారాలపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. పెండింగ్ బిల్లుల ఆమోదానికి సంబంధించిన అంశంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించటం తగదని స్పష్టం చేసింది. కారణం చెప్పకుండా గవర్నర్‌లు బిల్లులను వెనక్కి పంపలేరని తెలిపింది. బిల్లును నిరవధికంగా నిలిపివేసే అధికారం గవర్నర్‌కు లేదని కూడా తేల్చి చెప్పింది. గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి పంపితేనే రాష్ట్రపతి చర్యలు తీసుకోగలరని చెప్పింది. ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కు విచక్షణాధికారం ఉందని వెల్లడించింది. తన ముందుకు వచ్చిన బిల్లులను గవర్నర్ రాష్ట్రపతికి పంపడం, అభిప్రాయాలతో తిరిగి పంపడం, బిల్లును పరిశీలించి సూచనలు ఇవ్వడం వంటివి మాత్రమే చేస్తారని తెలిపింది. రాష్ట్ర పరిపాలనలో తుది అధికారం ఎన్నుకోబడిన మంత్రివర్గానిదేనని స్పష్టం చేసింది. ఒక రాష్ట్రంలో రెండు ఎగ్జిక్యూటివ్ పవర్స్ ఉండవని, ప్రభుత్వం ఒక్కటే ప్రధాన నిర్ణయాధికారి అని తేల్చి చెప్పింది. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులకు ఆమోదం తెలిపే విషయంలో న్యాయస్థానం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు మిగతా 2 లో



## బీహార్ సీఎంగా నితీశ్ ప్రమాణం

- 27మంది మంత్రులు కూడా..
- హాజరైన మోడీ, అమిత్ షా, చంద్రబాబు

04




## భార్యాపిల్లల హత్య కేసు

### నిందితుడికి ఉరిశిక్ష

- వికారాబాద్ జిల్లా కోర్టు సంచలన తీర్పు

02

## ఫిరాయింపు ఎమ్మెల్యేపై

# విచారణ

- పోచారం, అరికెపూడితో ముగింపు
- దానం, కడియంకు నోటీసులు

02



సుప్రీం మరో 4 వారాల గడువు ఇవ్వడంతో పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కుంటున్న 10 మంది ఎమ్మెల్యేలకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ నోటీసులు జారీ చేశారు. గురువారం పోచారం శ్రీనివాసరెడ్డి, అరికెపూడి గాంధీని విచారించారు. పదిమందిలో ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రం ఇప్పటి వరకు అఫిడవిట్‌లు దాఖలు చేయగా, దానం నాగేందర్, కడియం శ్రీహరికు స్పీకర్ మరోసారి నోటీసులు జారీ చేశారు.

## దేశవ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ

- కేంద్రమంత్రికి సీఎం రేవంత్ సూచన
- పరిశీలిస్తామన్న మంత్రి ప్రహ్లాద్ జోషి

02



## ఢిల్లీ ఎర్రకోట పేలుళ్ల ఘటన

- శ్రీనగర్‌లో మరో నలుగురిని అరెస్ట్ చేసిన ఎన్ఐఏ

04





## దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి మావద్ద లేరు

- హైకోర్టుకు తెలిపిన పోలీసులు

02

# అమెరికాతో ఆయుధ ఒప్పందం

అధునాతన జావెలిన్ క్షిపణి వ్యవస్థ సరఫరాకు అంగీకారం



భారత్-అమెరికాల మధ్య కీలకమైన రక్షణ ఒప్పందం కుదిరింది. దీంతో అధునాతన జావెలిన్ క్షిపణి వ్యవస్థ మన దేశానికి అందనుంది. రష్యాతో పోరులో ఉక్రెయిన్‌కు వరంలా వచ్చిన ఈ ఆయుధానికి ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన ఆదరణ ఉంది. కొన్ని వందల సంఖ్యలో రష్యన్ ట్యాంకులను పేల్చేసింది. ఈ క్రమంలో అమెరికాతో 93 మిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను భారత్‌కు విక్రయించేందుకు అగ్రరాజ్యం ఆమోదించింది. 04

## సీబీఐ కోర్టుకు జగన్



- వ్యక్తిగత హాజరుతో పూర్తయిన లాంఛనం
- జగన్ రాకతో అభిమానుల హల్‌చల్

02

10వ తరగతి ప్రశ్నాపత్రం

## లీకేజీ వ్యవహారం

- బండి సంజయ్‌పై కేసు కొట్టివేసిన హైకోర్టు
- మరో కేసులో నాంపల్లి కోర్టుకు హాజరైన బండి

02

## అంగారకుడి ఉపరితలంపై మిస్టీరియస్ శిల

04



అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా గుర్తింపు

రోవర్ పంపిన చిత్రాలపై మరిన్ని పరిశోధనలు

# గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు విధించలేం

మొదటి పేజీ తరువాయి

విధించడంపై దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము సంధించిన ప్రశ్నలపై అత్యున్నత న్యాయస్థానం సమాధానమిచ్చింది. పెండింగ్ బిల్లుల ఆమోదం కోసం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించడం తగదని సీజేఐ జస్టిస్ బిఆర్ గవాయ్ నేతృత్వం లోని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టంచేసింది. అయితే, కార ణం చెప్పకుండా గవర్నర్లు బిల్లులను వెనక్కి పంపలేరని వెల్లడించింది. ఈ మేరకు దీనిపై గతంలో ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సీజేఐ ధర్మాసనం పక్కనబెట్టింది. గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు ఆప్షన్లు ఉంటాయి. బిల్లులకు సమ్మతి తెలియజేయడం, కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం, బిల్లును తిరస్కరించి అసెంబ్లీకి పంపడం. ఈ మూడు ఆప్షన్లు ఎంచుకోవడంలో గవర్నర్ విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారు. ఇందుకు న్యాయస్థానాలు గడువు విధించడం సబబు కా దని అభిప్రాయపడ్డారు. గవర్నర్ల విధుల నిర్వహణ వ్యవహారాల్లో కోర్టులు జోక్యం చేసుకోవు. కానీ, కారణం లేకుండా దీర్ఘకాలంగా బిల్లులను పెండింగ్‌లో ఉంచిన సందర్భాల్లో కోర్టులు పరిమిత విచక్షణతో వ్యవహరించొచ్చు. రాష్ట్రపతి విషయంలోనూ ఇదే వర్తిస్తుంది. నిరవధిక ఆల



స్యం కొనసాగుతున్న సందర్భాల్లో అది న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని తెలిపారు. గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి రిజర్వ్ చేసిన ప్రతిసారీ ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి సుప్రీంను సంప్రదించాల్సిన అవసరం లేదు. ఆర్టికల్ 200 కింద గవర్నర్లకు విచక్షణాధికారం ఉంటుంది. అయితే, దాన్ని అపరిమితంగా వినియోగించలేరు. శాసనసభలు ఒకటికి రెండుసార్లు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్ర జాప్యానికి గురికావడంపై ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆ బిల్లులను ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని జస్టిస్ జెబి పార్దీవాలా, జస్టిస్ మహాదేవన్ ధర్మాసనం నిర్దేశించింది. దీంతో రాజ్యాంగ అధికరణం 143(1) ప్రకారం తనకున్న అధికారాన్ని వినియోగిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మే నెలలో పలు ప్రశ్నలతో సీజేఐకి లేఖ రాశారు. రాష్ట్రపతి విచక్షణ అధికారాల పరిధిలోకి వచ్చే రాష్ట్రాల బిల్లులకు ఆమోదం తెలిపే అంశంలో న్యాయస్థానం గడువు విధించడం ఎంతవరకు న్యాయ సమ్మతమో తెలపాలంటూ సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. దీనిపై సీజేఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. పది రోజుల పాటు అన్ని పక్షాల వాదనలను ఆలకించిన ధర్మాసనం సెప్టెంబరు 11న తీర్పు రిజర్వు చేసింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించలేమంటూ తాజాగా తీర్పు వెలువరించింది.

# సీబీఐ కోర్టుకు జగన్

## వ్యక్తిగత హాజరు తో పూర్తయిన లాంఛనం

### జగన్ రాకతో అభిమానుల హల్‌చల్

**హైదరాబాద్, నవంబర్ 20:** అక్రమాస్తుల కేసులో వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ సీబీఐ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. న్యాయమూర్తి ఎదుట విచారణకు వచ్చారు. విజయవాడ నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చి అక్కడి నుంచి నాంపల్లిలోని కోర్టుకు ఆయన చేరుకున్నారు. విచారణ అనంతరం జగన్ అక్కడి నుంచి లోటస్‌పాండ్‌కు వెళ్లిపోయారు. మరోవైపు వైకాపా నేత పేర్ని నాని, మరో ముగ్గురు నేతలను కోర్టు లోపలికి పోలీసులు అనుమతించలేదు. దీంతో వారు గేట్ వద్దే నిలుచున్నారు. ఈ కేసులో 2013 సెప్టెంబర్ నుంచి జగన్ బెయిల్‌పై ఉన్నారు. ఇప్పుడు కూడా వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరగా సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరవడం లేదని, ఈ కేసుల్లో డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున ప్రత్యక్షంగా హాజరవ్వాలని సీబీఐ తెలిపింది. దీంతో ఈ నెల 21లోగా వ్యక్తిగతంగా హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకరోజు ముందే ఆయన కోర్టుకు హాజరయ్యారు. అక్రమాస్తుల కేసులో వైకాపా అధ్యక్షుడు జగన్ సీబీఐ కోర్టుకు హాజరుకానున్న నేపథ్యంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్ వద్ద వైకాపా కార్యకర్తలు హల్‌చల్ చేశారు. కొందరు రప్పా రప్పా అంటూ నినాదాలు చేశారు. ఎయిర్ పోర్టు లోపలికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారితో వాగ్వాదానికి దిగారు. మరోవైపు సీబీఐ



కోర్టు వద్ద పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు.

# దేశవ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ

- కేంద్రమంత్రికి సీఎం రేవంత్ సూచన
- పరిశీలిస్తామన్న మంత్రి ప్రహ్లాద్ జోషి

**హైదరాబాద్, నవంబర్ 20:** దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో రేషన్ షాపుల్లో వినియోగదారులకు సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గురువారం ఉదయం హోటల్ తాజ్‌కృష్ణలో కేంద్రమంత్రితో ముఖ్యమంత్రి రేవంత్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు తినే బియ్యాన్ని సరఫరా చేస్తేనే సంక్షేమ పథకం ఉద్దేశం నెరవేరుతుందని సీఎంఅన్నారు. తెలంగాణలాగే కేంద్రం కూడా దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ అంశాన్ని పరిశీలించాలని కేంద్ర మంత్రి కోరారు. అవసరమైతే అధ్యయనం చేసి తగు నిర్ణయం తీసుకోవాలని వినతి చేశారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. పూర్తిస్థాయి అధ్యయనం తర్వాత పరిశీలించి దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణిపై నిర్ణయం తీసుకుంటామని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





# ఫిరాయింపు ఎమ్మెల్యేపై విచారణ

## పోచారం, అరికెపూడితో ముగింపు • దానం, కడియంకు నోటీసులు

**హైదరాబాద్, నవంబర్ 20:** సుప్రీం మరో నాలుగు వారాల గడువు ఇవ్వడంతో పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ నోటీసులు జారీ చేశారు. గురువారం పోచారం శ్రీనివాసరెడ్డి, అరికెపూడి గాంధీలను విచారించారు. పదిమందిలో ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రం ఇప్పటి వరకు అఫిడవిట్‌లు దాఖలు చేయని పరిస్థితి. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి.. స్పీకర్ నోటీసులకు స్పందించని విషయం తెలిసిందే. దీంతో వారిరువురికి స్పీకర్ మరోసారి నోటీసులు జారీ చేశారు. అనర్హత పిటిషన్లపై అఫిడవిట్ దాఖలు చేయాలని అసెంబ్లీ స్పీకర్ స్పష్టం చేశారు. ఇక.. పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విచారణ గురువారంతో ముగిసింది. కేసు విచారణ ఆలస్యంపై సుప్రీం సీరియస్ అవడంతో పాటు నాలుగు వారాలు గడువు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విచారణలో వేగం పెంచాలని అసెంబ్లీ స్పీకర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా రెండో విడత విచారణలో భాగంగా నలుగురు ఎమ్మెల్యేలను విచారణకు పిలిచారు. ఉదయం ఎమ్మెల్యేల విచారణ మొదలైంది. పోచారం శ్రీనివాస్ రెడ్డి వర్సెస్ జగదీశ్ రెడ్డి కేసును స్పీకర్ విచారించారు. ఇరు వర్గాల వాదనలను స్పీకర్ విన్నారు. అలాగే మధ్యాహ్నం అరికెపూడి గాంధీ వర్సెస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కేసు విచారించారు. వీరి విచారణతో మొత్తం ఎనిమిది మంది ఎమ్మెల్యేల విచారణ పూర్తి అవుతుంది. మరోవైపు ఎమ్మెల్యే దానం నాగేందర్ ఢిల్లీ వెళ్లారు. ఏఐసీసీ పెద్దలను కలవనున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ ముగియనున్నప్పటికీ ఇప్పటి వరకు దానం అఫిడవిట్లు దాఖలు చేయలేదు. విచారణకు హాజరైతే వేటు పడుతుందని దానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. వేటు పడితే ఆరు సంవత్సరాల పాటు పోటీ చేయడానికి నో ఛాన్స్. ఈ క్రమంలో రాజీనామా చేసేందుకు దానం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. రాజీనామా చేస్తే తన పరిస్థితి ఏంటని పార్టీ పెద్దలతో దానం సంప్రదింపులు జరుపనున్నట్లు తెలుస్తోంది.

# సీఎంతో ఏఐ సీఈవో భేటీ



**హైదరాబాద్, నవంబర్20:** జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్ రెడ్డితో అనలాగ్ ఏఐ ఫౌండర్,సీఈవో అలెక్స్ భేటీ అయ్యారు. డిసెంబర్ 8, 9న జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరుకావాలని అలెక్స్ కిప్‌మన్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. తెలంగాణ రైజింగ్ విధానం కింద పారిశ్రామిక వేత్తలకు, పెట్టుబడిదారులకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా అలెక్స్ బృందానికి వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. తెలంగాణ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులతో పాటు 'ఫిజికల్ ఇంటెలిజెన్స్' వ్యవస్థలను అనుసంధాన విధానాలపై వారు చర్చించారు. సీఎం రేవంత్ రెడ్డి అభ్యర్థన మేరకు హైదరాబాద్ నగరానికి ట్రాఫిక్ రద్దీ, వరదలు, వాతావరణ మార్పు అంచనా వంటి సమస్యలను అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి పరిష్కరించడంలో అనలాగ్ అలెక్స్ బృందం ఆసక్తిని వ్యక్తం చేసిందని సమాచారం.

# నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి

## రేపు తిరిగి పుట్టపర్తికి ముర్ము ప్రయాణం

**హైదరాబాద్,నవంబర్ 20 :** తిరుమల పర్యటన ముగించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం మధ్యాహ్నం బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఆమె రాజ్ భవన్‌కు వెళ్తారు. మధ్యాహ్నం భోజనం చేసి.. రాజ్ భవన్‌లో విశ్రాంతి తీసుకుంటారు. 3:50గంటలకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి చేరుకుంటారు. సాయంత్రం 4గంటలకు రాష్ట్రపతి నిలయం వేదికగా నిర్వహించే భారతీయ కళా మహోత్సవాన్ని రాష్ట్రపతి ముర్ము ప్రారంభిస్తారు. తిరిగి సాయంత్రం 6:15 గంటలకు ఆమె తిరిగి రాజ్ భవన్‌కు చేరుకుంటారు. తెలంగాణ రాజ్‌భవన్‌లో రాష్ట్రపతి ముర్ము బస చేయనున్నారు. శనివారం ఉదయం 9:30 గంటలకు బేగంపేట ఎయిర్ పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో ఆంధ్రప్రదేశ్ శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తికి బయలుదేరి వెళ్తారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో హైదరాబాద్‌లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.



# దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి మావద్ద లేరు

## హైకోర్టుకు తెలిపిన పోలీసులు

**అమరావతి, నవంబర్ 20:** మావోయిస్టు నాయకులు దేవజీ, మల్లా రాజిరెడ్డి కోర్టులో హాజరు పర్చాల్సిందిగా కోరుతూ దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో పిటిషనర్లు చేసిన అభ్యర్థనపై కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ విచారణలో భాగంగా, దేవజీ, మల్లా రాజిరెడ్డి తమ అదుపులో లేరని పోలీసులు హైకోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొన్నాయి. అలాగే, అరెస్ట్ చేసిన మావోయిస్టులను సంబంధిత మేజిస్ట్రేట్ ఎదుట నియమిత విధానంలోనే హాజరుపర్చినట్లు కూడా పోలీసులు వివరణ ఇచ్చారు. అయితే, మావోయిస్టు నేతలు తమ అదుపులో ఉన్నారని పోలీసులు ముందుగా ప్రెస్ స్టేట్మెంట్ రిలీజ్ చేశారని పిటిషనర్ వాదించారు. దీనిపై స్పందించిన పిటిషనర్ తరఫు న్యాయవాది, ఆ ప్రెస్ స్టేట్మెంట్‌ను కోర్టు ముందు సమర్పిస్తామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో, మావోయిస్టులు పోలీసుల ఆధీనంలోనే ఉన్నారని నిరూపించే ఆధారాలను సమర్పించాలని పిటిషనర్లకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుపై తదుపరి విచారణను శుక్రవారం నాటికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

# భార్యాపిల్లల హత్య కేసు

## నిందితుడికి ఉరిశిక్ష ఖరారు • వికారాబాద్ జిల్లా కోర్టు సంచలన తీర్పు




**వికారాబాద్, నవంబర్ 20:** భార్య, పిల్లల్ని దారుణంగా హత్య చేసిన కేసులో వికారాబాద్ జిల్లా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నిందితుడికి ఉరిశిక్ష ఖరారు చేసింది. వికారాబాద్ జిల్లాలో 2019లో ప్రవీణ్ అనే వ్యక్తి తన భార్య, ఇద్దరు పిల్లల్ని చంపేశాడు. అనంతరం ఆత్మహత్యగా చిత్రీకరించాడు. అయితే, ఈ కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో జిల్లా కోర్టు అతడికి ఉరిశిక్ష విధించింది. ఈ మేరకు కేసును విచారించిన వికారాబాద్ జిల్లా కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. భార్య, పిల్లలను చంపిన కేసులో నిందితుడికి కోర్టు ఉరి శిక్ష ఖరారు చేసింది. 2019లో భార్య, ఇద్దరు పిల్లలను ప్రవీణ్ అనే వ్యక్తి చంపాడు. భార్య, పిల్లల హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించాడు. ప్రవీణెలి భార్య, పిల్లలను చంపాడని రుజువు కావడంతో కోర్టు ఉరిశిక్ష విధించింది. పోలీసుల సమాచారం ప్రకారం.. ప్రవీణ్ కుమార్(32) వృత్తిరీత్యా ప్రయివేటు ఉద్యోగి. వికారాబాద్‌లో భార్యాపిల్లలతో కలిసి నివాసం ఉండేవాడు. భార్య చాందినీకి వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో ఆమెను ఇనుపరాడ్‌తో కొట్టి చంపాడు. ఐదేండ్ల కుమార్తె ఇన్షిల్‌ను, తొమ్మిదేళ్ల కుమారుడు అయాన్ కూడా హతమార్చాడు. అయితే చాందిని ప్రవీణ్‌కు రెండో భార్య. కాగా కుమారుడు అయాన్ చాందినికి మొదటి భర్త సంతానం. ఇన్షిల్ మాత్రం ప్రవీణ్ కూతురే. ఇక భార్య చాందిని మొబైల్‌లో సందేశాలు చూసి ప్రవీణ్ తీవ్ర ఆగ్రహావేశాలకు లోనయ్యాడు. తరుచూ మద్యం సేవించి భార్యతో గొడవపడేవాడని దర్యాప్తులో బయటపడింది. ఈ క్రమంలోనే భార్యాపిల్లలను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. అయితే వారిని హత్య చేసిన అనంతరం తాను కూడా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పటికీ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అనంతరం అతన్ని రిమాండ్‌కు తరలించారు. నేరం తీవ్రత, ఆధారాలను పరిశీలించిన వికారాబాద్ కోర్టు ఉరిశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది

# 10వ తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం

## బండి సంజయ్‌పై కేసు కొట్టివేసిన హైకోర్టు

### మరో కేసులో నాంపల్లి కోర్టుకు హాజరైన బండి



**హైదరాబాద్, నవంబర్ 20:** కేంద్ర హోమ్ శాఖ మంత్రి బండి సంజయ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. గతంలో కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును గురువారం నాడు హైకోర్టు కొట్టేసింది. 2023లో 10వ తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై ఈ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇందులో బండి సంజయ్ పేరును ప్రధాన నిందితుడిగా కమలాపురం పోలీసులు చేర్చారు. రాజకీయ కక్షల కారణంగానే ఈ కేసు నమోదు చేశారని హైకోర్టుకు బండి సంజయ్ న్యాయవాది తెలిపారు. కేసు నమోదులో సరైన సెక్షన్లు కానీ.. దర్యాప్తులో పూర్తి వివరాలు కానీ లేవని హైకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఈ కేసును కొట్టేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలావుంటే బండి సంజయ్ గురువారం నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. గతంలో తనపై నమోదైన పలు కేసుల నేపథ్యంలో విచారణ కోసం కోర్టు వెళ్లారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ పని చేసిన విషయం తెలిసిందే.ఆ సమయంలో నల్గొండలోని వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అలాగే హుజూర్‌నగర్ నియోజకవర్గం నేరేడుచర్ల లో బండి సంజయ్ కాన్వాయ్‌పై బీఆర్ఎస్ నేతలు రాళ్ల దాడి చేశారు. నాటి ఘటనల్లో బండి సంజయ్‌పై పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల విచారణలో భాగంగానే కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. అయితే, విచారణ అనంతరం జనవరి 7వ తేదీకి ఈ కేసును న్యాయమూర్తి వాయిదా వేశారు.

# కేటీఆర్‌కు బిగ్ షాక్

## ఫార్ములా-కారు రేసు కేసు విచారణకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్

- అనుమతిస్తూ జిష్టుదేవ్ ఉత్తర్వులు
- ఫార్ములా ఈ-కార్‌రేసులో కీలక పరిణామం
- త్వరలో చార్జ్‌షీట్ దాఖలు చేయనున్న ఏసీబీ
- రూ.55కోట్ల బదిలీ వ్యవహారమే కీలకం



**హైదరాబాద్, నవంబర్ 20:** మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు బిగ్‌షాక్ తగిలింది. ఈ ఫార్ములా -కారు రేసు కేసుకు సంబంధించి ఆయనపై విచారణ చేపట్టేందుకు గవర్నర్ అధికారికంగా అనుమతి మంజూరు చేశారు. ఈ కేసులోనిధుల దుర్వినియోగంపై విచారణకు గవర్నర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఏసీబీ త్వరలోనే కేటీఆర్‌పై చార్జ్‌షీట్ దాఖలు చేయనుందని సమాచారం. ప్రభుత్వం ఈ విషయంలో లేఖ రాయడంతో ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో కేటీఆర్‌ను ఏసీబీ విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించారు. ఈ కేసులో ఇప్పటికే పలుమార్లు కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో రూ. 54.88 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈక్రమంలో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి కోరుతూ గతంలో ఏసీబీ లేఖ రాసింది. ఆయన పాత్రపై సాక్ష్యాలు ఉన్నాయంటూ అందులో పేర్కొంది. ఈక్రమంలో తాజాగా ఏసీబీ అధికారులకు అనుమతి ఇస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో త్వరలోనే ఏసీబీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయనుంది. ఈ కేసులో కేటీఆర్‌ను ఏ-1గా, సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ను ఏ-2గా ఏసీబీ పేర్కొంది. ఇప్పటికే కేటీఆర్ ఈ కేసు విషయంలో ఏసీబీ విచారణకు నాలుగు సార్లు హాజరయ్యారు. ఈ కేసులో ఏ-2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ విషయంలో తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులు ఇప్పటికే కేంద్రంలోని డీఓపీటీకు లేఖ రాశారు. గవర్నర్ అనుమతి నేపథ్యంలో, చార్జ్‌షీట్ దాఖలుకు ముందు ఏసీబీ అధికారులు మరోసారి కేటీఆర్‌ను లేదా ఇతర కీలక వ్యక్తులను విచారించే అవకాశం ఉంది. ఈ కేసుపై గవర్నర్ అనుమతి లభించడంతో, రాజకీయ వర్గాలలో, పరిపాలనా వర్గాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏసీబీ త్వరలో దాఖలు చేయబోయే చార్జ్‌షీట్‌తో ఈ కేసు విచారణ కీలక మలుపు తిరగనుంది. ఫార్ములా ఈ-కారు రేసులో క్విడ్ ప్రోకో జరిగినట్టు ఏసీబీ నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. రూ.54.88 కోట్ల నిధులు దారి మళ్లింపుపై ఆరోపణలు చేసింది. ఇక, 2024లో ఫార్ములా ఈ-కారు కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కార్ రేస్ వ్యవహారంలో 2024 డిసెంబర్ నెలలో ఏసీబీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏ1గా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. కేసు విచారణలో భాగంగా ఇప్పటికే కేటీఆర్‌ను రెండు సార్లు, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను 3 సార్లు ఏసీబీ అధికారులు విచారించారు. తాజాగా ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు.

కేసుకు సంబంధించిన నివేదికను అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు మంగళవారం తెలంగాణ ప్రభుత్వానికి అందించారు. ప్రాసిక్యూషన్ అనుమతి కోరుతూ ఏసీబీ అధికారులు ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో కేటీఆర్‌ను ఈ కేసులో ఏ1గా పేర్కొంటూ ఏసీబీ కేసు నమోదు చేసింది. ఫార్ములా-ఈ కార్ రేసు నిర్వహణ కోసం యూకేకు చెందిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్, ఏస్ నెక్ట్స్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్, తెలంగాణ పురపాలకశాఖ 2022 అక్టోబరు 25న ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం కార్ రేస్ నిర్వహణకు అయ్యే ఖర్చును స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్ట్స్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్ భరించాలి. అలాగే కార్ రేసు నిర్వహణకు వీలుగా తెలంగాణ పురపాలక శాఖ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి. అందులో భాగంగా 2023 ఫిబ్రవరి 11 జరిగిన రేస్ కోసం పురపాలక శాఖ తరఫున హెచ్ఎండీఏ రూ.12 కోట్లు ఖర్చు చేసింది. రేసు నిర్వహణ ఖర్చును స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్ట్స్ జెన్ భరించింది.

## కేటీఆర్‌పై అక్రమ కేసులు రేవంత్ లక్ష్యం

**రాజకీయ కక్షసాధింపునకు పరాకాష్ట**

**బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శ**



**హైదరాబాద్, నవంబర్ 20:** హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నాడని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి రాక్షసానందం పొందటం అప్రజాస్వామికమన్నారు. కేటీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పరాకాష్ఠ అని ఆయన విమర్శించారు. ప్రతిపక్ష నేతలను వేధించడమే సీఎం రేవంత్‌రెడ్డి పనిగా పెట్టుకున్నారు. కేటీఆర్‌కు అండగా ఉంటాం అని హరీశ్‌రావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాజకీయ లబ్ది పొందేందుకు చేస్తున్న చిల్లర డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. అక్రమ కేసులతో కేటీఆర్, బీఆర్ఎస్ నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరని ఎక్స్ వేదికగా వెల్లడించారు. కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నడు రేవంత్‌రెడ్డి. అక్రమ కేసులతో కేటీఆర్, బిఆర్ఎస్ నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరు. కేటీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుంది. రేవంత్ రెడ్డి దుర్మార్గ వైఖరిని న్యాయపరంగా ఎదుర్కొంటాం.' అని ట్వీట్ చేశారు.



## సీఎం ఏం చేస్తారో చెప్పాలి

**కేటీఆర్ విచారణకు గర్నవర్ ఆమోదం స్వాగతించాల్సిన విషయం**

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌మధ్య లోపాయికారి ఒప్పందం**

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్**

**హైదరాబాద్, నవంబర్20 :** ఫార్ములా ఈ కారు రేసు కేసులో బీఆర్ఎస్ మాజీ మంత్రి కేటీఆర్ విచారణకు గవర్నర్ అనుమతించినందునా ..ఈ కేసులో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ఏం చేస్తారో ఇప్పుడు చెప్పాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్ విచారణకు గవర్నర్ ఆమోదం రావొద్దని రేవంత్ రెడ్డి కోరుకున్నారని ఆరోపించారు. కేసీఆర్ కు, రేవంత్ రెడ్డికి మధ్య లోపాయికారి ఒప్పందం కుదిరిందని, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, కేసీఆర్ పాలన నడుస్తుందన్నారు. కేసీఆర్ ను జైలుకు పంపకుండా రేవంత్ రెడ్డి కేంద్రం మీద నెపం వేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ ఆస్తులు జప్తు చేసి జైలుకు పంపుతామని గతంలో రేవంత్ రెడ్డి అన్నారని గుర్తు చేశారు. అర్బన్ నక్సలైట్లు చిన్నపిల్లలను రెచ్చగొడుతున్నారని ఆయన విమర్శించారు. వారు మాత్రం పదవులు పొందుతూ.. కార్లలో తిరుగుతూ సొంత పైరవీలు చేసుకుంటూ రూ.కోట్లు సంపాదిస్తున్నారని ఆరోపించారు. హనుమంతుడిపై సినీ దర్శకుడు రాజమౌళి చేసిన వ్యాఖ్యలపై మీడియా ప్రశ్నలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ సందర్భంగా స్పందించారు. దేవుడు కరుణించి.. రాజమౌళి దేవుడిని నమ్మే విధంగా మార్చాలని కోరుకుంటున్నానని సంజయ్ అన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో జక్కన్న నిండు నూరేళ్ళు బ్రతికి.. మంచిగా సక్సెస్ అవ్వాలని కోరుతున్నానని వ్యాఖ్యానించారు.

## కేటీఆర్, గోరటిపై కేసు కొట్టివేత

**హైదరాబాద్, నవంబర్ 20:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్నకు తెలంగాణ హైకోర్టులో ఊరట దొరికింది. సైఫాబాద్ పోలీస్ స్టేషన్లో వారిద్దరిపై నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని నమోదైన కేసులో ఊరట లభించింది. 2023 ఎన్నికల సమయంలో తెలంగాణ సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల జ్యోతి వద్ద ఇంటర్వ్యూలు చేశారని కేటీఆర్, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్నపై సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. కోడ్ ఉల్లంఘిస్తూ అనుమతి లేకుండా డ్రోన్ ఎగురవేశారనీ పోలీసులు కేసు పెట్టారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా.. ప్రభుత్వ పథకాలపై గోరెటి వెంకన్నను కేటీఆర్ ఇంటర్వ్యూ చేశారని విచారణ సందర్భంగా పోలీసుల తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. బీఆర్ఎస్ పార్టీకి లబ్ది చేకూర్చే విధంగా ఆ ఇంటర్వ్యూ ఉందని తెలిపారు. అయితే, రాజకీయ లబ్ది కోసమే కేసు నమోదు చేశారని కేటీఆర్ తరఫు న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు.. కేటీఆర్, గోరెటి వెంకన్నపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.

## దేవుళ్ల పేరుతో సినిమాలు తీస్తావ్

**నమ్మకం లేదంటావా రాజమౌళి**

**మండిపడ్డ ఎమ్మెల్యే రాజాసింగ్**



**హైదరాబాద్,నవంబర్ 20:** రాజమౌళి ప్రతి సినిమాను హిందూ సమాజం బహిష్కరించాలని ఎమ్మెల్యే రాజాసింగ్ పిలుపునిచ్చారు. ఇటీవల ఓ ఈవెంట్‌లో భాగంగా రాజమౌళి చేసిన వ్యాఖ్యలపై తాజాగా రాజాసింగ్ స్పందించారు. ప్రస్తుతం డైరెక్టర్ రాజమౌళికి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోందన్నారు.. తన అమ్మానాన్నలకు హనుమంతుడిపై విశ్వాసం ఉంది కానీ.. తనకు లేదని రాజమౌళి అన్న మాటలను రాజాసింగ్ గుర్తు చేశారు. నీకు విశ్వాసం లేదు కానీ.. అదే ధర్మం, దేవుళ్లపై సినిమాలు చేసి.. కోట్లల్లో సంపాధించుకున్నావు కదా..? అని ప్రశ్నించారు. అసలు నీ ప్లాన్ ఏంది..? ఇప్పుడు వారణాసి పేరుతో మహేష్‌బాబును పెట్టి మరో సినిమా తీస్తున్నావ్.. ఈ మూవీ ప్రమోషన్‌లో భాగంగా ఈ వ్యాఖ్యలు చేశావా? అని నిలదీశారు. లేదా నువ్వు నిజంగానే నాస్తికుడివా..? ఓ సారి డిక్లెర్ చేయ్యాలని డిమాండ్ చేశారు. అసలు నీ తప్పేం లేదు.. అసలు తప్పు హిందులదే అన్నారు. నీలాంటి నీశ్చపు డైరెక్టర్లను హిందువులు కనుగొనలేక పోతున్నారన్నారు. ధర్మం పట్ల, హిందూ దేవుళ్ల పట్ల నమ్మకం లేని రాజమౌళి సినిమాలు హిందువులు ఎందుకు చూడాలని రాజాసింగ్ నిలదీశారు. 'బాహుబలి సినిమా తీశావు.. ప్రభాస్‌తో శివలింగాన్ని ఎత్తించావు.. కోట్ల రూపాయలు సంపాధించుకున్నావు.. మళ్లీ మా హిందు దేవుళ్లపై నమ్మకం లేదని చెబుతున్నావు. రాజమౌళికి ఇది కొత్తేం కాదు.. భగవాన్ శ్రీకృష్ణుడికి చెందిన 16 వేల మంది దాసులను, లవర్స్ అంటూ హేళన చేశాడు. నాకు రాముడిపైన ఇష్టం లేదు.. రాముడి స్టోరీ బోరింగ్ స్టోరీ అని గతంలో ట్వీట్ చేశాడు. ఇప్పుడు హనుమంతుడిపైన కామెంట్స్ చేశాడు.. హిందువులకు ఓ సూచన.. ఇలాంటి డైరెక్టర్లపై కంప్లేంట్ ఇవ్వండి. ఇలాంటి వ్యక్తులను జైల్లో వేస్తేనే హిందూ దేవుళ్లపై కామెంట్స్ చేస్తే ఏం జరుగుతుందో తెలుస్తుంది. ఇలాంటి పనికిరాని డైరెక్టర్ సినిమాలు చూడొద్దు.. మనం ఇలాంటి వ్యక్తులు తీసిన సినిమాలు చూస్తాం.. వాళ్లు వందలు వేల రూపాయలు సంపాధించుకుంటారు. ఇలా నాస్తికత్వం పేరుతో మన దేవుళ్లపై కామెంట్స్ చేస్తారు.. అందుకే ఈ డైరెక్టర్ సినిమాలు బ్యాన్ చేద్దాం..' అని రాజాసింగ్ వ్యాఖ్యానించారు.

## వారణాసి టైటిల్ వ్యాఖ్యలపై మండిపడ్డ మాధవీలత




**హైదరాబాద్, నవంబర్ 20:** దర్శకుడు రాజమౌళి దేవుణ్ణి అడ్డంగా పెట్టుకొని డబ్బులు సంపాదిస్తున్నారని బీజేపీ నాయకురాలు మాధవి లత పేర్కొన్నారు. తాజాగా వారణాసి టైటిల్ రిలీజ్ సందర్భంగా రాజమౌళి చేసిన కామెంట్లపై మాట్లాడుతూ... నమ్మకాన్ని వ్యాపారంగా వాడుకుంటున్నారని మండిపడ్డారు. హిందువులు తేరగా దొరుకుతున్నారా? రాముడికి ఒకే పెళ్లాం ఉంది అంటున్న రాజమౌళికి ఎంతమంది పెళ్లాలు ఉన్నారని ప్రశ్నించారు. కర్మ ఫలితం అనుభవించాడు కాబట్టే ఆంజనేయుడు లేదని అన్నాడు. సినిమా చూసే మా వాళ్లకు బుద్ధి ఉండాలని హిందువులను ఉద్దేశించి అన్నారు. వందల కోట్లు సంపాదించిన నీవు.. బాహుబలి సినిమాకి పనిచేసిన వారికి ఏమైనా ఇచ్చావా? అని నిలదీశారు. రాజమౌళి భక్తిని తీసుకురాలేదు? దాన్ని వాడుకుంటున్నారన్నారు. భక్తే లేదు అనే వాడి దగ్గరికి మనం వెళ్తామా? నీవు ఏమి దైవ సేవ చేశావ్.. నా దేవుళ్ళను ఒవైసీ బ్రదర్స్ అవమానించారని నేను రాజకీయాల్లోకి వచ్చాను.. నా దేవుళ్ళ పైకి ఎవరు వచ్చిన ఊరుకోను.. రాజమౌళితో సమాధానం భగవంతుడు ఇప్పిస్తారు.. రాముడి మీద అసహ్యంగా మాట్లాడారు.. ఆయనకు క్షమాపణకు కూడా అర్హత లేదు.. తగిన గుణపాఠం చెప్పాలి..' అని రాజమౌళిపై ఫైర్ అయ్యారు.

## ఆపరేషన్ సంభవ్ సక్సెస్

**ఇది ఇకముందూ కొనసాగుతుంది**

**రంపచోడవరంలో ఎన్‌కౌంటర్ ప్రాంతంలో పర్యటన**

**స్వాధీనం చేసుకున్న ఆయుధాలను పరిశీలించిన డీజీపీ**

**రంపచోడవరం, నవంబర్ 20:** ఏపీలో ఆపరేషన్ సంభవ్ సక్సెస్ అయ్యిందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అన్నారు. గురువారం ప్రత్యేక హెలికాప్టర్‌లో రంపచోడవరం చేరుకున్న డీజీపీ.. ఏవోబీ ప్రాంతంలో ఏరియల్ సర్వే చేశారు. ఆపై జిల్లాలోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన రెండు వరుస ఎన్‌కౌంటర్లలో మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలను పరిశీలించారు. ఏకే 47 గన్స్, రైఫిల్, పేలుడుకు ఉపయోగించిన వస్తువులను పరిశీలించారు. అనంతరం డీజీపీ మీడియాతో మాట్లాడుతూ.. మారేడుమిల్లిలో జరిగిన రెండు ఎన్ కౌంటర్లలో 13 మంది మావోయిస్టులు మృతి చెందారని తెలిపారు. 50 మంది మావోయిస్టులను అరెస్ట్ చేశామన్నారు. ఈ ఏడాది జూన్‌లో రంపచోడవరంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో లొంగిపోవాలని మావోయిస్టులను హెచ్చరించామని తెలిపారు. మావోయిస్టులు లేని ఏపీగా చేయాలనుకున్నామని వెల్లడించారు. ఆపరేషన్ సంభవ్ కొనసాగుతుందని డీజీపీ హరీష్ గుప్తా స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం అల్లూరు సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో అగ్రనేతలు నేలరాలిన విషయం తెలిసిందే. మొదటి ఎన్‌కౌంటర్‌లో మావో అగ్రనేత హిడ్మా, ఆయన సతీమణితో పాటు.. నలుగురు మావోయిస్టులు మరణించారు. రెండో రోజు జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడు మంది మావోలు హతమయ్యారు. వీరిలో కీలక నేతలు కూడా ఉన్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో లభించిన డైరీ ఆధారంగా ఏపీలోని పలు జిల్లాల్లో పోలీసులు, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ బలగాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. దాదాపు 50మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. వారికి వైద్య పరీక్షల అనంతరం ఆయా జిల్లాల కోర్టుల్లో హాజరుపర్చగా, కోర్టు వారికి రిమాండ్ విధించిన విషయం తెలిసిందే.



## ఆయుధ వ్యాపారీ సంజయ్ భండారీ కేసు

**కాంగ్రెస్ రాబర్ట్ వాద్రాపై ఈడీ ఛార్జిషీట్**



**న్యూఢిల్లీ,నవంబర్ 20:** కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఛార్జిషీట్ దాఖలు చేసింది. బ్రిటన్‌కు చెందిన ఆయుధ వ్యాపారి సంజయ్ భండారీ కేసుతో ముడిపడిన మనీలాండరింగ్ కేసులో ఈ అభియోగ పత్రాన్ని ప్రత్యేక కోర్టులో సమర్పించింది. రాబర్ట్ వాద్రాపై ఇది రెండో మనీలాండరింగ్ ఛార్జిషీట్. ఈ ఏడాది జులైలో షికోపుర్ భూముల వ్యవహారంలో ఈడీ ఆయనపై ఓ అభియోగ పత్రాన్ని దాఖలు చేసిన విషయం తెలిసిందే.దిల్లీలోని ఆయుధ వ్యాపారి సంజయ్ భండారీ ప్రాంగణంపై 2016లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. డిజిటల్ డేటా, ఇతర డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రాబర్ట్ వాద్రా పేరు వెలుగుచూసిందని, లండన్‌లోని ఓ స్థిరాస్తితో వాద్రాకు సంబంధం ఉందనే ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే 2017 ఫిబ్రవరిలో ఈడీ 'నగదు అక్రమ చలామణి చట్టం' కింద భండారీ తదితరులపై కేసు నమోదు చేసింది. లండన్‌లోని స్థిరాస్తికి సంబంధించి భండారీతో వాద్రా సంబంధాలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఇందులో భాగంగా గతంలో వాద్రాను విచారించింది. ఆయన ఈ ఆరోపణలను ఖండిస్తూ వస్తున్నారు. ఇదిలా ఉండగా.. 2016లో ఐటీ దాడులు జరిగిన వెంటనే సంజయ్ భండారీ లండన్‌కు పారిపోయాడు. అతడి అప్పగింత అభ్యర్థనను బ్రిటన్ కోర్టు తిరస్కరించింది. దిల్లీ కోర్టు జులైలో అతడిని పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించింది.

## కండువా ఊపుతూ హుషారెత్తించిన మోడీ



**పాట్నా, నవంబర్ 20:** ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అయ్యారు. . బిహార్‌లో ఎన్డీయే విజయాన్ని పూర్తిగా ఆస్వాదిస్తున్న ప్రధాని మోదీ, 'గంచా మూమెంట్' తీసుకొచ్చారు. మెడలోని కండువా తీసి తలపై గుండ్రంగా తిప్పుతూ జనాన్ని ఉర్రూతలూగించారు. బిహార్ ముఖ్యమంత్రి నీతీష్ కుమార్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ప్రధాని ఉదయం నుంచీ చాలా ఉత్సాహంగా కనిపించారు. వేదిక వద్దకు చేరుకునే సందర్భంలో కూడా ప్రధాని తన కండువా గాల్లో ఊపుతూ అక్కడికి చేరుకున్న ప్రజల్ని ఉత్సాహపరిచే యత్నం చేశారు.



సంపాదకీయం


# రాజకీయమంటే హంగామా చేయడమా!

రాజకీయాలు పూర్తిగా కలుషితమయ్యాయి. నేరచరిత్ర ఉన్నవారు కూడా హంగామా చేస్తున్నారు. కోర్టులో కేసుకు హాజరు కావడం కోసం హంగామా చేయడం దారుణం కాక మరోటి కాదు. దానికోసం పోలీసులు హైరానా పడడం, భారీగా బందోబస్తు ఏర్పాటు చేయడం పరిపాటిగా మారింది. వీరికోసం ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీస్ సిబ్బంది సమయాన్ని, శక్తిని వృథా చేస్తున్నారు. తాజాగా హైదరాబాద్‌లో సిబిఐ కోర్టుకు హాజరయ్యేందుకు వచ్చిన జగన్ యధావిధిగా తన మార్క్ హంగామాతో వచ్చారు. పదినిముషాల పాటు కోర్టులో హాజరు కావడానికి మందీబార్బలంతో రావడం, ఇతరులకు అసౌకర్యం కలిగించడం, ఆయన గారి కోసం పోలీసులు నానా హడావిడి చేయడం, రక్షణ కోసం అంటూ జనాన్ని రోడ్డుమీది నుంచి తరిమెయ్యడం లాంటివి చూశాం. గరువారం హైదరాబాద్‌లో జగన్ చేసిన హంగామా చూశాక ఇలాంటి నేతలను ఎన్నకుందుకు ప్రజలు సిగ్గుపడాలి. మన ఓట్లతో వీరు ఊరేగడమేంటని ఆలోచన చేయాలి. జగన్ ఎన్నికయ్యాక ఇప్పటి వరకు అసెంబ్లీకి రావడం లేదు. అలాగే ప్రతిపక్షనేత హోదా ఇస్తేనే వస్తానని మొండి కేశారు. ఇక విశాఖ వచ్చినా, గుంటూరుకు వెళ్లినా ఇదే రకంగా హంగామా చేశారు. ఆయన ర్యాలీగా వచ్చే తోవలో ప్రాణాలు పోగ్గొట్టుకుంటే మాకేంది అన్న రీతిలో జగన్ అహంకారంగా సాగుతున్నారు. ఇకపోతే గతంలో కెటిఆర్ కూడా ఒకటి రెండు సందర్భాల్లో ఇలాగే చేశారు. ఇ- కార్ రేసులో విచారణకు వచ్చినప్పుడు, మరో సందర్భంలో ఇలా చేశారు. భారీ కాన్వాయ్‌లతో రావడం, హంగామా చేయడం అవసరమా అన్నది ఆలోచన చేయాలి. కోర్టులు ఆంక్షలు విధిస్తే తప్ప వీరు ర్యాలీలు ఆపేలా లేరు. కనీసం కోర్టుకు విచారణకోసం వచ్చే సందర్భంలో అయినా కోర్టులే ఆంక్షలు విధిస్తే మంచిందని ప్రజలు కోరుకుంటున్నారు. అధికారంలో ఉండగా అడ్డదిడ్డంగా సంపాదించడం, ప్రజలను పురుగుల్లా చూడడం, ఓట్ల కోసం దండాలు పెట్టడం, పీఠమెక్కగానే హంగామాలు చేయడం భారత రాజకీయాల్లో పరిపాటిగా మారింది. ప్రజలే దీనిగురించి ఆలోచించాలి. ఇలాంటి వారిని రాజకీయాలకు దూరం పెట్టాలి. అధికారంలో ఉంటే తమంత గొప్పవారు లేరని భావించడం,అధికారం పోయాక, అధికారంలో ఉన్నవారిని విమర్శించడం ఇప్పుడు కొత్త తరం రాజకీయాలు చూస్తున్నాం. ప్రత్యర్థులను వేధించడమే అధికారం పరమావధి అన్నట్టుగా తెలుగునాట రాజకీయాలను మార్చిన ఘనత కేసీఆర్, జగన్‌రెడ్డిలకు దక్కింది. ఓటుకునోటు కేసులో పట్టుకుని జైలులో వేసిన రేవంత్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి కావడాన్ని కేసీఆర్, కేటీఆర్,హరీష్ రావులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ కారణంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేటీఆర్,హరీష్ రావులు ఒంటికాలి మీద లేస్తున్నారు. అసభ్యంగా వాడు, వీడు అని సంబోధిస్తున్నారు. జగన్ కూడా అప్పుడే ఎపిలో అంతా అయిపోయిందన్న భావనలో మాట్లాడుతున్నారు. కూటమి ప్రభుత్వం దారుణంగా ఉందని రంకెలు వేస్తున్నారు. ఇలాంటి జగన్,కేసీఆర్‌లనే ప్రజలు మట్టికరిపించారని మరచి మాట్లాడుతున్నారు. ఇకపోతే ఏం జరుగుతుందో తెలుసుకోకుండా అటు జగన్, ఇటు కెటిఆర్ అర్జంటుగా గద్దెమీద ఊర్చోవాలన్న తొందరలో ఏదిపడితే అది మాట్లాడేస్తున్నారు. సోషల్ మీడియాలో ఎవరు పడితే వాళ్లు, ఏదిపడితే అది వాగుతున్నారు. తమచేతిలో సోషల్ మీడియా ఉందన్న గర్వంతో ఇష్టానుసారం పోస్టులు పెడుతున్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత వీరిద్దరూ సోషల్ మీడియాపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. బలమైన సోషల్ మీడియా సైన్యాన్ని ఏర్పాటు చేసుకుంటే ఎన్నికల్లో గెలిచిపోవచ్చునని, అలా లేనందునే గత ఎన్నికల్లో ఓడిపోయా మని కేటీఆర్ గతంలో ఓ సందర్భంలో అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌కు బలమైన సోషల్ మీడియా సైన్యం ఉండి కూడా గత ఎన్నికల్లో ఓటమిని తప్పించుకోలేదు. తాను చేసిందంతా ప్రజల మంచికోసమే అన్న భ్రమలో బటన్ నొక్కుతూ పోయారు. ఇప్పుడేమో ర్యాలీలు, హంగామాలతో మళ్లీ తన ప్రతాపం చాటుతున్నారు. ప్రజల్ని తక్కువ అంచనా వేయడం వల్లే తాము ఓడిపోయామని ఈ రెండు పార్టీల వాళ్లు ఇంకా గుర్తిచడం లేదు. తాము అధికారంలో ఉంటే అంతా సవ్యంగా ఉందని, ఇతరులు అధికారంలో ఉంటే సర్వనాశనం అయిపోతోందని ఎపిలో జగన్, తెలంగాణలో కెటిఆర్ భావిస్తున్నారు. కెసిఆర్ ఉన్నప్పుడే తెలంగాణ బాగుండేదని, ఇప్పుడు ప్రమాదంలో పడిందని కెటిఆర్ నిరంతరంగా ప్రచారం చేయించు కుంటున్నారు. జగన్ అనుయాయులు కూడా ఇదే తరహాలో మీడియా సమావేశాలు పెట్టివాపోతున్నారు. మధ్యలో తెలంగాణ సెంటిమెంట్‌తో బిఆర్ఎస్ నేతలు మళ్లీ తమ రాజకీయ పాచికలు వేస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, ఆ తర్వాత కూడా కొంత కాలంపాటు ఇదే సెంటిమెంట్‌ను రగిలించి బీఆర్ఎస్ రాజకీయంగా లాభపడింది. అధికారం పోవడంతో ఈ ఇద్దరు నేతలు సొంత మీడియాలో అసత్య కథనాలు, అబద్దాలను ప్రచారం చేసుకుంటున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎవరేమిటో తెలుసు. అందుకే జూబ్లీహిల్స్‌లో బిఆర్ఎస్ బోల్తాపడింది. బిజెపి కూడా అతిగా ఊహించుకుని బొక్కబోర్లా పడింది. ఇవన్నీ ఒక ఎత్తయితే హంగామా రాజకీయాలను రాజకీయ పార్టీల నేతలు మానుకోవాలి. ప్రజలను పరామర్శించ డానికి హంగామా అవసరం లేదు. కోర్టుకు హాజరయినప్పుడు కూడా మందీమార్బలంతో ర్యాలీలు అవసరం లేదు. ఈ విషయాలు అన్ని పార్టీలకు అవసరం. అధికారంలో ఉన్నా, లేకపోయిన పార్టీలు ఈ సూత్రాన్ని పాటించాలి. తమ బలప్రదర్శన కోసం ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దు. తమను ఆదరించి అక్కున చేర్చుకున్న వాళ్లే ఎన్నికల్లో ఎందుకు తిరస్కరించారో ఓడిన ప్రతి నాయకుడు తెలుసుకోవాలి. గుణపాఠం నేర్చుకోవాలి. ఓడిపోతే ఎదుటి పార్టీ వారిపై నెపం నెట్టి తప్పించుకోవడం రాజకీయ లక్షణం కాదని గుర్తించాలి. తెలంగాణలో తమకు తిరుగులేదని భావించిన బీఆర్ఎస్‌కు ఈ దుస్థితి ఎందుకు ఏర్పడిందో, ఎపిలో బటన్లు నొక్కినా ఎందుకు ప్రజలు తిరస్కరించారో గుర్తించి దిద్దుబాటు చర్యలు తీసుకొంటేనే ఈ రెండు పార్టీలకు మనుగడ ఉంటుంది.అహంకారపూరిత పోకడలను సమాజం హర్షించదని ప్రతి రాజకీయ నేతా గుర్తించాలి.

# అంగారకుడి ఉపరితలంపై మిస్టీరియస్ శిల

**అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా గుర్తింపు**

**రోవర్ పంపిన చిత్రాలపై మరిన్ని పరిశోధనలు**



**న్యూయార్క్, నవంబర్ 20:** అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా అంగారకుడి ఉపరితలంపై మిస్టీరియస్ రాయిని గుర్తించింది. ఈ రాయి మార్స్ సహజ, భౌగోళిక నిర్మాణంతో పూర్తిగా భిన్నంగా కనిపిస్తున్నది. శాస్త్రవేత్తలు 80 సెంటీమీటర్ల పొడవున్న ఈ రాయికి 'ఫిప్సాక్స్‌లా' అని నామకరణం చేశారు. ప్రస్తుతానికి ఈ రాయిని ఎలియన్ రాక్‌గా పేర్కొంటున్నారు. ఈ రాయిని సెప్టెంబర్ 19న గుర్తించారు. నాసా పెర్సెవరెన్స్ రోవర్ పంపిన ఈ రాయిని చూసి నాసా శాస్త్రవేత్తలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రోవర్ జెజెరో క్రేటర్ సమీపంలోని వెర్నోడెన్ ప్రాంతంలోని రాళ్లపై అధ్యయనం జరుపుతున్నది. రోవర్ మాస్ట్‌క్యామ్-జెడ్ కెమెరా ఈ రాయిని గుర్తించి ఫొటో తీసింది. ఈ ఫొటోను నాసా బ్లాగ్ పోస్ట్‌లో షేర్ చేసింది. ఫిప్సాక్స్‌లా మరో సౌర వ్యవస్థకు చెందింది కావొచ్చునని తెలిపింది.ఈ రాయి చిన్న డెస్క్‌ను పోలి ఉంటుందని పరిశోధకులు పేర్కొంటున్నారు. మరో సిద్ధాంతం ఏంటంటో ఇది ఉల్కాపాతం ఫలితంగా కూడా వచ్చి ఉండవచ్చని పేర్కొంటున్నారు. క్యూరియాసిటీ రోవర్ 2014లో రెండు మీటర్ల వెడల్పు లెబనాన్ ఉల్కను, 2023లో కాకో ఉల్కను గుర్తించింది. ఆ తర్వాత శాస్త్రవేత్తలు జెజెరో క్రేటర్‌లో ఇలాంటి లోహాలను గుర్తించాలని ఆశించారు. ఈ రాక్‌ను నాసా పరిశోధకుల బృందం గతవారంలో నిశితంగా పరిశీలించింది. రాయి ఆకారం, పరిమాణం, చుట్టుపక్కల ప్రాంతాల్లోని రాళ్లతో పోలిస్తే భిన్నంగా ఉందని పేర్కొంది. పెర్సెవరెన్స్ రోవర్ సూపర్‌క్యామ్ లేజర్, స్పెక్ట్రోమీటర్లతో చేసిన విశ్లేషణలో ఈ రాయిలో ఐరన్, నికెల్ మూలకాలు ఎక్కువ సాంద్రతతో ఉన్నట్లుగా గుర్తించారు. అంగారకుడి ఉపరితలంపై ఇలాంటి మూలకాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. గ్రహశకలాల కేంద్ర భాగాల్లో ఏర్పడే ఐరన్-నికెల్ ఉల్కలలో అధికంగా ఉంటాయి. ఈ క్రమంలో మరో సౌర వ్యవస్థ నుంచి మార్స్‌పైకి వచ్చి ఉండవచ్చని నాసా అంచనా వేస్తున్నది.

# అమెరికాతో 93 మిలియన్ డాలర్ల ఆయుధ ఒప్పందం

**అధునాతన జావెలిన్ క్షిపణి వ్యవస్థ సరఫరాకు అంగీకారం**



**వాషింగ్టన్, నవంబర్ 20:** భారత్-అమెరికాల మధ్య కీలకమైన రక్షణ ఒప్పందం కుదిరింది. దీంతో అధునాతన జావెలిన్ క్షిపణి వ్యవస్థ మన దేశానికి అందనుంది. రష్యాతో పోరులో ఉక్రెయిన్‌కు వరంలా వచ్చిన ఈ ఆయుధానికి ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన ఆదరణ ఉంది. భుజం మీద నుంచి గురిపెట్టి ప్రయోగించే ఈ మిసైల్.. కొన్ని వందల సంఖ్యలో రష్యన్ ట్యాంకులను పేల్చేసింది. ఈ క్రమంలో అమెరికాతో 93 మిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను భారత్‌కు విక్రయించేందుకు అగ్రరాజ్యం ఆమోదించింది. జావెలిన్ ట్యాంక్ విధ్వంసకర క్షిపణిని భుజంపై నుంచి శత్రు ట్యాంకుల పైకి గురిపెట్టి ప్రయోగించవచ్చు. దీనిలో 3.7 అడుగుల క్షిపణి, డిస్పోజబుల్ లాంఛ్ ట్యూబ్, కమాండ్ కంట్రోల్ యూనిట్ ఉంటాయి. వాస్తవానికి ట్యాంక్ విధ్వంసకర ఆయుధాన్ని ప్రయోగించిన ప్రదేశం నుంచి పొగ, వేడి వెలువడతాయి. ప్రత్యర్థులు హీట్ సెన్సర్లతో వాటిని గుర్తిస్తారు. కానీ, జావెలిన్‌లో తొలుత ట్యూబ్ నుంచి ఓ మోటర్ క్షిపణిని బయటకు కొంతదూరం విసురుతుంది. ఆ తర్వాత క్షిపణి మోటార్ పనిచేయడం మొదలుపెట్టి లక్ష్యం వైపు దూసుకెళుతుంది. దీనిని కంప్యూటర్‌తో నియంత్రిస్తారు. దీంతో కచ్చితంగా జావెలిన్‌ను ఎక్కడినుంచి ప్రయోగించారో శత్రువుకు అర్థం కాదు. ఈ లోపు ప్రయోగించిన వారు సురక్షిత ప్రదేశంలో దాక్కోవచ్చు. రీయాక్టివ్ ఆర్మర్ రక్షణ కవచాలను ఛేదించి.. ట్యాంకును ధ్వంసం చేసేలా దీనిలో రెండు దశల్లో పేలుడు పదార్థాలను అమర్చారు. తొలిదశలో కవచాన్ని ఛేదించి.. ఆ తర్వాత దశలో వార్‌హెడ్ ట్యాంక్‌ను ధ్వంసం చేస్తుంది. వీటిని అమెరికాకు చెందిన రక్షణరంగ దిగ్గజాలు రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ సంస్థలు అభివృద్ధి చేశాయి. వీటి ఉత్పత్తి చాలా క్లిష్టమైన, ఖరీదైన వ్యవహారం. వీటి ధర 2 లక్షల డాలర్ల వరకూ ఉంటుందని అంచనా.రష్యాతో పోరులో ఉక్రెయిన్ ఈ క్షిపణులను విపరీతంగా వినియోగించింది. మాస్కోకు చెందిన పలు యుద్ధ ట్యాంకులను పేల్చేసింది. వీటి నుంచి తప్పించుకోవడం కోసం రష్యా తమ ట్యాంకులపై లోహపు బోన్లను అమర్చిందంటే.. వీటి సామర్థ్యాన్ని అర్థం చేసుకోవచ్చు. మొత్తం 93 మిలియన్ డాలర్ల ఆయుధాలను విక్రయించేందుకు భారత్-అమెరికా మధ్య ఒప్పందం కుదిరింది. ఇందులో 45.7 మిలియన్ డాలర్ల విలువైన జావెలిన్ మిసైల్ వ్యవస్థలు, సంబంధిత హార్డ్‌వేర్‌ను అగ్రరాజ్యం అందించనుంది. దీంతోపాటు 47.1 మిలియన్ డాలర్ల విలువైన ఎక్స్‌కాలిబర్ ప్రొజెటక్టైల్స్, ఇతర సైనిక పరికరాలను విక్రయించనుంది. తొలివిడతలో భాగంగా జావెలిన్ ఎఫ్‌జీఎం-148 మిసైల్స్, 25 జావెలిన్ లైట్‌వెయిట్ కమాండ్ లాంఛ్ యూనిట్స్ వంటి వాటిని భారత్‌కు అందించనుంది.

# బీహార్ సీఎంగా నితీశ్ ప్రమాణం

**27మంది మంత్రులు కూడా ప్రమాణం ● ప్రమాణం చేయించిన గవర్నర్**

**హాజరైన మోడీ, అమిత్ షా, చంద్రబాబు**



**పాట్నా, నవంబర్ 20:** బిహార్ సీఎంగా జేడీయూ అధినేత నితీశ్ కుమార్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. సీఎంగా ఆయన ప్రమాణ స్వీకారం చేయడం ఇది పదోసారి. పట్నాలోని గాంధీ మైదానంలో నితీశ్‌తో పాటు 27 మంది మంత్రులు ప్ర ఓమాణస్వీకారం చేయగా.. సామ్రాట్ చౌదరీ, విజయ్ కుమార్ సిన్హాలకు డిప్యూటీ సీఎం పదవులు దక్కాయి. గవర్నర్ అరీఫ్ మహ్మద్ ఖాన్ సీఎం, మంత్రులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తదితరులు హాజరయ్యారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అదరగొట్టింది. మొత్తం 243 అసెంబ్లీ సీట్లకు నితీశ్ కుమార్ నేతృత్వంలో ఎన్డీయే ఏకంగా 202 సీట్లు దక్కించుకుంది. బీజేపీ 101 సీట్లలో పోటీ చేసి 89 చోట్ల గెలుపొందింది. 101 సీట్లలోనే పోటీ చేసిన జేడీయూ 85చోట్ల విజయం సాధించింది. తాజాగా ప్రమాణస్వీకారం చేసిన 27 మంత్రుల్లో.. 14 మంది బీజేపీ నుంచి కాగా, 9 మంది జేడేయూకు చెందిన నేతలు. బిహార్‌లో సీఎం నితీశ్ కుమార్ దాదాపు 19 ఏళ్లు పదవిలో ఉన్నారు. 2000 సంవత్సరంలో ఏడు రోజులు మాత్రమే సీఎంగా పని చేశారు. ఇప్పుడు ఎన్డీయే కూటమి మళ్లీ ఆయనకే పగ్గాలు అప్పగించడంతో పదోసారి సీఎంగా ప్రమాణం చేశారు. పదోసారి బిహార్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్‌కు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. 'సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్‌కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. నితీశ్ రాజకీయంలో ఎంతో అనుభవం ఉన్న నాయకుడు. రాష్ట్రంలో మంచి పాలన అందించిన వ్యక్తి అనే అద్భుతమైన రికార్డు ఆయనకు ఉందని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.






# ఢిల్లీ ఎర్రకోట పేలుళ్ల ఘటన

**శ్రీనగర్‌లో మరో నలుగురిని అరెస్ట్ చేసిన ఎన్ఐఏ**

**న్యూఢిల్లీ, నవంబర్ 20:** ఢిల్లీ ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుళ్లతో సంబంధం ఉన్న మరో నలుగురు నిందితులను ఎన్ఐఏ పట్టుకుంది. గురువారం శ్రీనగర్‌లో వీరిని అరెస్ట్ చేసింది. దీంతో ఈ దాడితో సంబంధం ఉన్న మొత్తం అరెస్టులు 6కి పెరిగాయి. నవంబర్ 10న ఢిల్లీలోని ఎర్రకోట దగ్గర జరిగిన పేలుడు ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ ముమ్మరంగా దర్యాప్తు సాగిస్తోన్న సంగతి తెలిసిందే. జిల్లా సెషన్స్ జడ్జి, పాటియాలా హౌస్ కోర్టు జారీ చేసిన ఆర్డర్ల మేరకు నలుగురు నిందితులను జమ్మూ కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. వారిని జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వామాకు చెందిన డాక్టర్ ముజమ్మిల్ షకీల్ గనై, జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌కు చెందిన డాక్టర్ అదీల్ అహ్మద్ రాథర్, ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోకు చెందిన డాక్టర్ షాహీన్ సయీద్ ఇంకా, జమ్మూ కాశ్మీర్‌లోని షోపియన్‌కు చెందిన ముఫ్తీ ఇర్ఫాన్ అహ్మద్ వాగేగా గుర్తించారు. వీరందరూ ఢిల్లీ బ్లాస్ట్ లో ముఖ్యమైన పాత్ర పోషించారని దర్యాప్తు ఏజెన్సీ చెబుతోంది. టీవల ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను ఎన్ఐఏ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. పేలుడుకు ఉపయోగించిన కారు ఎవరి పేరున రిజిస్టర్ అయిందో అతనైన(అమీర్ రషీద్ అలీ)ని, దాడిలో పాల్గొన్న ఉగ్రవాదికి సాంకేతిక సహాయం అందించిన డానిష్ అలియాస్ జాసిర్ బిలాల్ వాని లను ఔఎం అదుపులోకి తీసుకుంది. ఈ కేసులో పూర్తి కుట్రను వెలికితీసే ప్రయత్నాలలో భాగంగా వీరిద్దరినీ ఇంటరాగేట్ చేస్తోంది.కాగా, ఈ పేలుడు ఘటన జరిగిన వెంటనే కేంద్ర హోంమంత్రిత్వ శాఖ దీనిపై దర్యాప్తును ఎన్ఐఏకి అప్పగించింది. దాడికి కారణమైన గ్రూపులోని ప్రతి సభ్యుడిని గుర్తించి అరెస్టు చేయడానికి ఏజెన్సీ వివిధ రాష్ట్ర పోలీసు దళాలతో కలిసి పనిచేస్తోంది. నవంబర్ 10న ఢిల్లీలోని నేతాజీ సుభాష్ మార్గ్‌లో మ-ఎష్కరమూకలు జరిపిన పేలుడులో 15 మంది మరణించారు.

# కల్తీ నెయ్యి కేసులో వైవీ విచారణ

**హైదరాబాద్, నవంబర్ 20 :** టీటీడీ కల్తీ నెయ్యి కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో వైఎస్సార్ సీపీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డిని సిట్ బృందం గురువారం విచారించింది. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 10లోని ఆయన నివాసానికి సిట్ అధికారుల బృందం చేరుకుని టీటీడీ కల్తీ నెయ్యి కేసులో ఆయన ఇంట్లోనే విచారిస్తోంది. ఇప్పటికే ఈ కేసులో వైవీ సుబ్బారెడ్డి పీఎ చిన్న అప్పన్నతో పాటు టీటీడీ మాజీ ఈవోతో పాటు పలువురు అధికారులను సిట్ విచారించింది. వారు చెప్పిన సమాచారం మేరకు సిట్ వైవీ సుబ్బారెడ్డిని విచారిస్తోంది. సిట్ అధికారులు పలువురి స్టేట్మెంట్స్‌తో పాటు పలు డాక్యుమెంట్స్ తీసుకొచ్చారు. వాటిని ముందుంచి వైవీ సుబ్బారెడ్డిని విచారించారు.

# రాత్రిపూట వసతి గృహాల ఆకస్మిక తనిఖీ

**విద్యార్థులకు వసతులు, దుప్పట్లపై కలెక్టర్ రాహుల్ రాజ్ ఆరా**

**మెరుగైన లైటింగ్, పరిశుభ్రతపై సిబ్బందికి కీలక సూచనలు**



**మెదక్, నవంబర్ 20 (సమయం న్యూస్):**

మెదక్ జిల్లా కలెక్టర్ శ్రీ రాహుల్ రాజ్ గురువారం రాత్రి జిల్లా కేంద్రంలోని సమీకృత సంక్షేమ బాలుర వసతి గృహ సముదాయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతి సదుపాయాలు, భోజనం, ఆరోగ్య పరిరక్షణ అంశాలను కలెక్టర్ పరిశీలించారు. వసతి గృహంలో విద్యార్థులతో కలసి మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నూతన దుప్పట్ల పంపిణీ జరిగిందా లేదా అని కలెక్టర్ ప్రత్యేకంగా ఆరా తీశారు. భోజనం తయారీ, ఆహార నాణ్యత, వసతి గృహ పరిసరాల పరిశుభ్రత, దినచర్య నిర్వహణపై సిబ్బందిని ప్రశ్నించారు. హాస్టల్‌లో విద్యార్థులకు సరిగా లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. చదువులో మరింత పురోగతి సాధించేందుకు విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థుల రక్షణ, ఆరోగ్యం, పరిశుభ్రత విషయంలో కీలక సూచనలు చేశారు. వసతి గృహ సిబ్బంది నిర్లక్ష్యానికి తావు ఉండదని, సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని విద్యార్థులకు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ విద్యాశాఖ నిబంధనల అమలును కచ్చితంగా పాటించాలని అధికారులకు ఆదేశించారు.

# విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్, నవంబర్ 20 (సమయం న్యూస్):**

బాలల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల, ఖుర్షాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఆరోగ్యంపై అవగాహన అవసరమని, తినే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవడం వంటి చిన్న అలవాట్లు కూడా పెద్ద మార్పులు తీసుకొస్తాయని పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు బాలల దినోత్సవ వారోత్సవాలు నిర్వహించామని వివరించారు. గతంలో రాగి, జొన్న వంటి పౌష్టికాహారాన్ని పెద్దవాళ్లు ఎక్కువ తీసుకునేవారని, ప్రస్తుతం పిల్లల్లో పోషకాహార లోపం పెరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మాయిల్లో పీరియడ్స్ కారణంగా అనీమియా ఎక్కువగా కనిపిస్తోందని, ఇందుకు ఐరన్ మాత్రలను ప్రభుత్వం అందిస్తున్నదని చెప్పారు. పాఠశాల మెనూ లో తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని చేర్చాలని సూచించారు. మన సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ఇంగ్లీష్ నేర్చుకోవడంలో పిల్లలు ముందుకు రావాలని అన్నారు. పదవ తరగతి విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని, సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. మంచి ర్యాంకులను సాధించేందుకు క్రమశిక్షణతో చదవాలని సూచించారు. సోషల్ మీడియా దూరం పాటించి, మొబైల్ వినియోగాన్ని తగ్గించాలని విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. పాఠశాలల్లో కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేయాలని, సైబర్ క్రైమ్‌ల నుంచి జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. వ్యక్తిగత వివరాలను ఎవరితోనూ పంచుకోవొద్దని, ఇలాంటి ప్రయత్నాలు జరిగితే వెంటనే తల్లిదండ్రులకు సమాచారమివ్వాలని చెప్పారు. అనంతరం ప్రశంస పత్రాలను విద్యార్థులకు అందజేశారు. బాల్య వివాహాల నిర్మూలనపై కలెక్టర్ విద్యార్థుల నుండి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సంతకాల సేకరణ బోర్డుపై సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, డీసీపీఓ రాజేంద్రప్రసాద్, సీడబ్ల్యూసీ ప్రతినిధులు వెంకటస్వామి, ప్రధానోపాధ్యాయులు సమీర్, సెక్టోరల్ అధికారి ప్రత్యూష, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శిక్షణ

**పరిగి మండలంలోని 50 ప్రభుత్వ పాఠశాలలకు విస్తరణ**



**పరిగి, నవంబర్ 20 (సమయం న్యూస్):**

శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, తేజస్ నెట్‌వర్క్ సహకారంతో, పరిగి మండలంలోని మొత్తం 50 ప్రభుత్వ పాఠశాలల్లో 'ప్రేరణ ఎఫ్ఎల్ఎన్ ' కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని మండల విద్యాధికారి (ఎంఈఓ) ఎం. గోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛందంగా అందించిన ఎఫ్ఎల్ఎన్ పుస్తకాలను విద్యార్థులు ఉపయోగించే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ శిక్షణ కార్యక్రమానికి మొత్తం 45 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. విద్యార్థుల సామర్థ్యాలను పెంచడానికి నిరంతరం కృషి చేస్తున్నటువంటి శిక్షణ ఫౌండేషన్ వారికి ఎంఈఓ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీలు) వెంకట ప్రసాద్ మరియు స్వప్న పాల్గొన్నారు. అదేవిధంగా శిక్షణ ఫౌండేషన్ సీనియర్ మెంటర్ అయినటువంటి తులజప్ప, మెంటర్స్ కవిత, రమేష్ లు పాల్గొన్నారు.

# ఏకాదశికి పకడ్బందీ ఏర్పాట్లు

**• కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




**భద్రాచలం, నవంబర్ 20 (సమయం న్యూస్):**

అధికారులందరు సమన్వయంతో కలిసి ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు సజావుగా ప్రశాంతంగా జరిగేలా అధికారులకు అప్పగించిన విధులను అంకితభావంతో కలిసి పనులు చేసి విజయవంతం అయ్యేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. గురువారం నాడు సబ్ కలెక్టరేట్ కార్యాలయంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు నిర్వహణ పై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులకు నిర్దేశించిన పనులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. మహోత్సవ ఏర్పాట్లు పర్యవేక్షణ దేవస్థానం, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారుల సమన్వయంతో పనిచేయాలని అన్నారు. తెప్పోత్సవము, ఉత్తర ద్వారా దర్శనం బందోబస్తు ఏర్పాట్లు పోలీస్ శాఖ చేపట్టాలని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా నామమాత్రపు ధరలతో సౌకర్యాలు కల్పించే విధంగా లాడ్జి, హోటల్ యజమానలనులతో సమావేశం నిర్వహించి ధరల నిర్ణయించాలని సబ్ కలెక్టర్‌కు సూచించారు. ఆలయ పరిసరాల్లో సీసీటీవీ లు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. భద్రాచలం, దుమ్ముగూడెం లోని దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని సూచించారు. భక్తులు మహోత్సవాలు వీక్షణకు ఎల్ఈడి స్క్రీన్స్ ఏర్పాటు చేయాలని, హంస వాహనం తనిఖీ చేసి ధృవీకరణ నివేదిక సమర్పించాలని ఇరిగేషన్ ఈ ఈ ని ఆదేశించారు. హంస వాహనంలోకి పరిమిత సంఖ్యలో మాత్రమే అనుమతించాలన్నారు. భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా పటిష్ట బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆహార పదార్థాలు నాణ్యతను తనిఖీ చేసి నివేదిక అందజేయాలని ఆహార తనిఖీ, తూనికలు కొలత శాఖల అధికారులను ఆదేశించారు. భద్రాచలం పట్టణంలో మరియు పర్ణశాలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. దుమ్ముగూడెంలో ప్రత్యేక టీములను ఏర్పాటు చేసి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతి సెక్టార్‌కు ఏర్పాట్లు పర్యవేక్షణకు జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించనున్నట్లు తెలిపారు. భక్తులకు సురక్షిత మంచినీరు సరఫరా చేయాలని చెప్పారు. భక్తులకు బస్సులు, రైల్వే సమయాలను, అలాగే జిల్లాలోని ప్రముఖ దర్శనీయ స్థలాలను తెలియజేయు చార్టులు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి లోటుపాట్లు రాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులు వాహనాలను పార్కింగ్ చేయడానికి ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాలకు సైనేజ్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. భద్రాచలం కరకట్ట,తెప్పోత్సవం వైకుంఠ ద్వార దర్శనం దగ్గర టాయిలెట్లు ఏర్పాట్లు చేయాలని, ప్రస్తుతం భక్తుల కోసం ఏర్పాటుచేసిన టాయిలెట్లు సరిపడా ఉండేలా చూసుకోవాలని, అవసరమైతే ఐటిసి వారి సహకారంతో టెంపరరీ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని అన్నారు. ఏకాదశి కార్యక్రమాలతో పాటు భక్తులు దర్శనీయ స్థలాలకు వెళ్లే విధంగా అలాగే ఈసారి భద్రాచలం పర్యాటక కేంద్రం అభివృద్ధి పరచుటకు బుజ్జి గొప్ప, బెండలపాడు, రథం గుట్ట, పగిడేరు ప్రాంతాలను దర్శించే విధంగా ఏర్పాటు చేయాలని, మరియు గిరిజన సాంప్రదాయ వంటకాలు, వస్తువులు ప్రతిబింబించే విధంగా ఎస్ హెచ్ జి మహిళలు మరియు ఆదివాసి గిరిజన మహిళలతో గోదావరి కరకట్టలపై స్టాల్స్ ఏర్పాటు చేసి సాంప్రదాయకమైన గిరిజన వంటకాలు ప్రదర్శించేలా చూడాలని అన్నారు. ఎక్సైజ్ శాఖ తరపున తెప్పోత్సవం ఉత్తర ద్వార దర్శనం అయిపోయే వరకు భద్రాచలం తో మొదలుకొని ఏకపాక వరకు బార్ షాపులన్నీ బంద్ చేయాలని, ఐటీసీ వారి సహకారంతో గ్రామపంచాయతీ సిబ్బంది సమన్వయం చేసుకొని గోదావరి బ్రిడ్జి పై సీట్ లైట్లు ఏర్పాటు చేయాలని, ఈ సంవత్సరం భక్తులు ఎవరు ప్లాస్టిక్ కవర్లు వినియోగించకుండా చూసి జూట్ బ్యాగులు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది భద్రాచలం పట్టణంలో డస్ట్ బిన్ లు ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ సంవత్సరం గోదావరిలో బోటింగ్ పాయింట్ లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉంచి గజఈతగాళ్లను సిద్ధం చేసి పర్యాటకులు నామమాత్రం రుసుముతో గోదావరిలో విహరించేలా తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. భక్తులకు సరిపడా ప్రసాదం కౌంటర్లు లడ్డు కౌంటర్లు ఏర్పాట్లు చేయాలని, యాత్రికులు చిన్న పిల్లలు తప్పిపోయిన సమాచారం అందించడానికి ప్రధానమైన కూడళ్లలో సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలోజిల్లా ఐటీడీఏ పీవోబి.రాహుల్, సబ్ కలెక్టర్ మ్రినాలి శ్రేష్ట,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, దేవస్థానం ఈఓ దామోదర్ రావు,కొత్తగూడెం ఆర్డీవో మధు, డీఎస్పీ పాల్వంచ సతీష్ మరియు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలు జీవితానికి వెలుగునిస్తాయి



**• పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత సద్వినియోగం చేసుకోవాలి**

**• జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట, నవంబర్ 20 (సమయం న్యూస్):**

జీవితానికి వెలుతురునిస్తూ భవిష్యత్తుకు దారి చూపేవి గ్రంథాలయాలేనని సూర్యాపేట జిల్లా కలెక్టర్ శ్రీ తేజస్ నంద్ లాల్ పవార్ పేర్కొన్నారు. సూర్యాపేట పట్టణంలోని జిల్లా గ్రంథాలయ కేంద్రంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకొని రాబోయే కాలంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించి భవిష్యత్తులో స్థిరపడాలని ఆకాంక్షించారు. విద్యార్థులు గ్రంథాలయంలో వార్తాపత్రికలు, కథల పుస్తకాలు, నవలలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, అలాగే ప్రతి రోజు 5 పేజీలు చదివి అలవాటుగా మార్చుకోవాలని ఆయన కోరారు. ఆధునాతన సౌకర్యాలతో నూతన గ్రంథాలయ భవనం త్వరలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన తెలిపారు. అనంతరం గ్రంథాలయం వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన వ్యాస రచన, ఉపన్యాసం పోటీ, చిత్ర లేఖనం పోటీలలో ప్రతిభ చూపిన వారికి కలెక్టర్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి లక్ష రూపాయల చెక్కును విరాళంగా గ్రంథాలయముకు అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, కార్యదర్శి బాలమ్మ, స్థానిక ప్రతినిధులు, అధికారులు తదితరులు హాజరైనారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

**మహిళా సాధికారిత కేంద్రం కో-ఆర్డినేటర్ చైతన్య**

**తిరుమలగిరి, తుంగతుర్తి మండలాల గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు**




**సూర్యాపేట, నవంబర్ 20 (సమయం న్యూస్):**

బాల్య వివాహాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ చైతన్యంతో కృషి చేయాలని మహిళా సాధికారిత కేంద్రం కో-ఆర్డినేటర్ చైతన్య పిలుపునిచ్చారు. గురువారం తిరుమలగిరి, తుంగతుర్తి మండలాలలోని మామిడాల, గొట్టిపర్తి, రావులపల్లి గ్రామాలలో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే హానికర ప్రభావాలు, చట్టపరమైన శిక్షలు, మరియు పిల్లల భవిష్యత్‌పై కలిగే ప్రభావాలను ప్రతి వర్గానికి వివరించి అవగాహన కల్పించారు. చిన్నారుల విద్య, ఆరోగ్యం మరియు భద్రతను కాపాడటంలో బాధ్యతను ప్రజలకు వివరించారు. బాల్య వివాహాల నిర్మూలనపై ప్రత్యేక ప్రతిజ్ఞ చేయించారు. సమాజంలోని ప్రతి వ్యక్తి చిన్నారుల భవిష్యత్తు రక్షణలో భాగస్వామ్యం కావాలని పిలుపునిస్తూ గ్రామాలలో ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు గ్రామస్థుల సహకారం అత్యంత కీలకమని అధికారులు తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమాలను మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, జిల్లా బాలల పరిరక్షణ విభాగం నుండీ నాగులుమీరా, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది, సఖి సెంటర్ నుండి, మహిళా సాధికారిత కేంద్రం నుండి చైతన్య, వినోద్, ఐసీడీఎస్ టీచర్లు రమాదేవి, ఐసీడీఎస్ సెక్టార్ సూపర్వైజర్లు ఖైరున్నిసా బేగం సంయుక్తంగా కలిసి నిర్వహించారు. వీరు గ్రామాల్లో క్షేత్రస్థాయి స్కూల్ టీచర్లు, ఆశాలు, ప్రభుత్వ ప్రతినిధులు, సంబంధిత అధికారులు మరియు సిబ్బందితో కలిసి ప్రజలతో ముఖాముఖీగా మాట్లాడి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలతో పాటు పిల్లలు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు మరియు వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



# జిల్లాకు 'జల శక్తి పురస్కారం'

**మా విజయానికి 'సమిష్టి కృషే కారణం'**

**కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**జనగాం, నవంబర్ 20 (సమయం న్యూస్):**

జనగామ జిల్లాకు రాష్ట్ర, కేంద్ర స్థాయిలో వివిధ అంశాల్లో వరుసగా అవార్డులు వస్తున్న నేపథ్యంలో, గురువారం అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్‌లో సంబరాలు చేసుకున్నారు. జల సంరక్షణలో భాగంగా చేపట్టిన 'మన జిల్లా మన నీరు' అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టి, జిల్లా, మండల, గ్రామ స్థాయి కార్యాలయాల్లో ఇంకుడు గుంతలను నిర్మించి, జిల్లాకు కేంద్ర 'జల శక్తి పురస్కారం' వచ్చేలా కృషి చేసిన జిల్లా కలెక్టర్ శ్రీ రిజ్వాన్ బాషా షేక్‌ను అన్ని శాఖల అధికారులు ఘనంగా సన్మానించారు. కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ మంత్రివర్యుల చేతుల మీదుగా కలెక్టర్ అవార్డు అందుకున్నందుకు ఈ వేడుకను నిర్వహించారు. కలెక్టర్ చేత కేక్ కట్ చేయించి, తమ సంతోషాన్ని, అభిప్రాయాలను అధికారులు పంచుకున్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు మాట్లాడుతూ, జిల్లాలో పనిచేస్తున్నందుకు తమకు గర్వంగా ఉందని, కలెక్టర్ తమకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. విధి నిర్వహణలో భాగంగా చాలా జిల్లాల్లో పని చేసినప్పటికీ, ఈ జిల్లాలో భయం లేకుండా, స్వేచ్ఛ వాతావరణంలో నిబద్ధతతో, బాధ్యతాయుతంగా పనిచేసేందుకు కలెక్టర్ గారు ఇస్తున్న సహకారం మర్చిపోలేమని అధికారులు తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. జిల్లాకు వచ్చే ప్రతి అవార్డులో అన్ని శాఖల అధికారుల కృషి ఉంటుందని, జిల్లాను అన్ని అంశాల్లో రాష్ట్ర స్థాయిలో ముందంజలో ఉంచేందుకు ఎల్లప్పుడూ అందరూ సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

# యెడపల్లి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన ఆహార భద్రతా అధికారులు.



**యెడపల్లి నవంబర్20( సమయం న్యూస్). :** గురువారం రోజున జిల్లా ఆహార భద్రత అధికారిణి టి.సునీత మరియు ఆహార భద్రత అధికారిణి జి.నవిత యెడపల్లి మండలం, జానకంపేటలోని ప్రధానమంత్రి శ్రీ జడ్పీహెచ్ఎస్ మరియు ఎంపీపీఎస్‌లలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో, వంటవారికి సరైన పరిశుభ్రత మరియు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మరియు ఆహార ముడి పదార్థాల కొనుగోలు బిల్లులను కలిగి ఉండాలనీ MDM ఏజెన్సీ వారికి సూచనలు ఇవ్వడం జరిగింది. నాసి రకము ముడిపదార్థాలను ఉపయోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు అని MDM ఏజెన్సీ వారిని హెచ్చరించడం జరిగింది

# మీసేవ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ TSTS జిల్లా మేనేజర్



**కొత్తగూడెం నవంబర్20( సమయం న్యూస్). :** అన్నపూరెడ్డి పల్లి చంద్రుగొండ ,కొత్తగూడెం మండలాల్లోని మీసేవ కేంద్రాల్లో ప్రజలకు అందుతున్న సేవల నాణ్యతను పరిశీలించేందుకు గురువారం ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు గారు మరియు తెలంగాణ గ్రీవెన్స్ అండ్ ట్రాన్సాక్షన్ సిస్టమ్ (TGTS) జిల్లా మేనేజర్ కృష్ణమూర్తి గారు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.మీసేవ కేంద్రాల నిర్వహణ, శుభ్రత, సాంకేతిక వసతులు, సిబ్బంది ప్రవర్తన, సేవల వేగం వంటి అంశాలను వారు సమగ్రంగా పరిశీలించారు. కేంద్రాలకు వచ్చే ప్రజలు సమర్పిస్తున్న దరఖాస్తులు ు ముఖ్యంగా ఆదాయ ధ్రువపత్రాలు, మౌలిక వృత్తి ధ్రువపత్రాలు, రేషన్ కార్డులు, జనన/మరణ ధ్రువపత్రాలు, వృద్ధాప్య పెన్షన్లకు సంబంధించిన దరఖాస్తులు ు వాటి ప్రాసెసింగ్ స్థితిని కూడా వివరంగా పరిశీలించారు.మీసేవ ఆపరేటర్లు ప్రభుత్వం నిర్ణయించిన ప్రామాణిక రుసుముల ప్రకారమే ఫీజులు వసూలు చేయాలని అధికారులు స్పష్టం చేశారు. సూచిక బోర్డులు, సేవల జాబితా, సేవలకు సంబంధించిన రుసుముల వివరాలు కేంద్రంలో స్పష్టంగా ప్రదర్శించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అధిక రుసుములు వసూలు చేయరాదని, అలా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలను ఎట్టి విధంగానూ మోసగించకూడదనీ, పారదర్శకతతో సేవలు అందించాలనీ, ప్రతి వినియోగదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు.



తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారిని శాసనసభ భవనంలోని స్పీకర్ చాంబర్ లో మర్యాద పూర్వకంగా కలిసిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ నూతన శాసనసభ్యులు నవీన్ యాదవ్.ఈసందర్భంగా నవీన్ యాదవ్ ను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపిన స్పీకర్ ప్రసాద్ కుమార్ గారు. చిత్రంలో లేజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్ వి. నరసింహా చార్యులు.

# టీబీ ముక్తా అభియాన్ క్యాంపు లను సద్వినియోగం చేసుకోండి.

- అంగడిరైచూర్ ప్రాథమిక వైద్యురాలు డాక్టర్ బుష్రా






**కొడంగల్ మండలం,నవంబర్,20(సమయం న్యూస్) :** సరైన సమయంలో టీబీ చికిత్స తీసుకుంటే టీబీ ను అరకట్టవచ్చు దానితోపాటు పోషకాహారం కూడా తీసుకుంటే త్వరగా నయం అవుతుందని అలాగే 2 వారాలకు మించి దగ్గు, సాయంత్రం జ్వరం రావడం, ఆకలి మండగించడం,రాత్రి పూట చమటలు పట్టడం మొదలగు లక్షణాలుంటే కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి తేమడ్డ పరీక్ష చేయించుకోవాలని అంగడిరాయచూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్దురాలు డాక్టర్ భూషరా తెలిపారు .ఈ క్యాంపు లో మొత్తం 123 మందికి పరీక్షించడం జరిగింది అందరికి బీపీ, షుగర్, పరీక్షలతో పాటు 45 మందికి తేమడ పరీక్ష కోసం సాంపిల్స్ సేకరించడం జరిగింది ఈ కార్యక్రమం లో డాక్టర్ నిఖిత,ఎం ఎల్ హెచ్ పి లక్ష్మి, టీబీ సూపర్ వైజర్ రహత్ అలీ, హెల్త్ అసిస్టెంట్ మధు, సూపర్ వైజర్ సుశీల,ఏ ఎన్ ఎం మణెమ్మ, ఆశలు పద్మమ్మ, మంజుల యాదమ్మ, ఇందిరా పాల్గొన్నారు

# ఇసుక అక్రమ రవాణకు పాల్పడితే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**నస్పూర్ నవంబర్20( సమయం న్యూస్). :** ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ మండలం తాళ్లపల్లి సమీపంలో గల గోదావరి నది తీరం వద్ద సాండ్ రీచ్ ను నస్పూర్ మండల తహసిల్దార్ సంతోష్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వినియోగదారుల సౌకర్యార్థం ఇసుక రీచ్ లను ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం ఆన్ లైన్ లో ఇసుక బుక్ చేసుకున్న వినియోగదారులకు రవాణా చేస్తుందని తెలిపారు. నిరుపేదల కోసం ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం ఇసుకను ఉచితంగా అందిస్తుందని, ప్రభుత్వ అభివృద్ధి పనులకు రీచ్ ల ద్వారా ఇసుకను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇసుక రీచ్ కు రాకపోకల కొరకు అవసరమైన తాత్కాలిక దారి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లాలోని హాజీపూర్ మండలం ముల్కల్లా సమీపంలోని ఇసుక రీచ్ ప్రాంతాన్ని హాజీపూర్ మండల తహసిల్దార్ శ్రీనివాస్ రావు దేశ్ పాండే తో కలిసి సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని గుడిపేట, నంనూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ప్రభుత్వం రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని, ఈ క్రమంలో రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా కేంద్రాల నిర్వహకులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వరి ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల సౌకర్యం త్రాగునీరు, నీడ మౌలిక వసతులు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు, తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు సమకూర్చడం జరిగిందని, రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీలో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



**కొత్తగూడెం నవంబర్20( సమయం న్యూస్). :** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రానున్న నేపథ్యంలో, ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ గురువారం ప్రత్యక్షంగా పరిశీలించారు. యూనివర్సిటీ క్యాంపస్ మొత్తం పర్యటించిన కలెక్టర్ అకాడమిక్ బ్లాక్ రిపేర్ వర్క్స్, ఆడిటోరియం మంమ్మత్తులు, బాలుర కామన్ మెస్ మరియు బాలికల హాస్టల్ పనుల పురోగతిని పరిశీలించి సంబంధిత శాఖలతో వివరంగా చర్చించారు. ఆడిటోరియంలో మౌలిక వసతులు, సీటింగ్ ఏర్పాట్లు, స్టేజ్ సెటప్, లైటింగ్, ఎలక్ట్రికల్ పనులు వంటి అంశాలన్నీ నాణ్యతతో పూర్తవ్వాలని ఆయన సూచించారు.యూనివర్సిటీ పాత మరియు కొత్త భవనాల సుందరీ కరణ, పార్కింగ్ ప్రాంతాల అభివృద్ధి, క్యాంపస్ అంతటా పరిశుభ్రత, లైటింగ్ పనులను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు-సలహాలు ఇచ్చారు. ముఖ్యమంత్రి ప్రారంభించే శిలాఫలకం ఏర్పాట్లను కూడా పరిశీలించి, దాని వద్ద ఏర్పాట్లు ఆకర్షణీయంగా, సముచిత ప్రమాణాలతో ఉండాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. విద్యార్థుల వసతి గృహాల్లో ఫర్నిచర్ అమరిక, నీటి సదుపాయాలు, శౌచాలయాల మరమ్మత్తులు, వసతి ప్రాంతాల పరిశుభ్రత వంటి అంశాలను కూడా ఆయన సమీక్షించారు. క్యాంపస్ ఆవరణ మొత్తం పచ్చదనం ఉట్టిపడేలా మొక్కలు నాటడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కళాశాల ప్రిన్సిపల్ డా. జగన్మోహన్ రాజును కలెక్టర్ ప్రత్యేకంగా ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యూనివర్సిటీ ప్రారంభోత్సవం జిల్లాకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమమని, అన్ని ఏర్పాట్లు అత్యున్నత నాణ్యతతో పూర్తవ్వాలని సూచించారు. విద్యా రంగంలో జిల్లాకు ఇది ఒక ప్రధాన మైలురాయి అవుతుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అన్ని శాఖల సమిష్టి బాధ్యత అని స్పష్టం చేశారు. అధికారులు అత్యంత వేగం మరియు శ్రద్ధతో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట కొత్తగూడెం మున్సిపల్ కమి షనర్ సుజాత, పంచాయతీరాజ్ ఈ ఈ శ్రీనివాస్, ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది మరియు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందిన అంబేద్కర్ ను స్ఫూర్తిగా తీసుకొని విద్యను అభ్యసించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.
- చదువే ఒక ఆయుధంగా మలుచుకొని జీవితాన్ని గొప్పగా తీర్చి దిద్దుకోవాలి
- కలెక్టర్









**వికారాబాద్, నవంబర్,20(సమయం న్యూస్) :** గురువారం అంతర్జాతీయ బాలల హక్కుల, జాతీయ గ్రంథాలయ దినోత్సవాల సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థలో సమావేశ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ... మహనీయుల మార్గంలో వారి స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కొలంబియా యూనివర్సిటీలో ఆర్థిక శాస్త్రంలో పట్టభద్రులయ్యారని, భారత ప్రజలకు మంచి రాజ్యాంగాన్ని రూపొందించారని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రతి ఒక్కరు వివిధ భాషల పట్ల పట్టును సాధించుకోవడం వల్ల కొత్త కొత్త విషయాలు తెలుసుకోవడానికి వీలవుతుందని కలెక్టర్ తెలిపారు. చదువుతోపాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొనాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఒక్కరు చిన్నప్పటినుండే ప్రతి ఒక్కరూ కొత్త కొత్త విషయాలను తెలుసుకోవాలని ఆయన సూచించారు. చదువు ద్వారానే సమాజంలో మంచి గుర్తు తీసుకువస్తుందని, మన తల్లిదండ్రులకు కూడా గౌరవాన్ని పెంపొందించే దిశగా ప్రతి ఒక్కరూ మెదలుకోవాలని కలెక్టర్ తెలిపారు. చదువే ఒక ఆయుధంగా మలుచుకొని జీవితాన్ని గొప్పగా తీర్చి దిద్దుకోవాలని కలెక్టర్ సూచించారు. భాష ద్వారానే మన భావాన్ని తెలుపవచ్చని, అందుకే ప్రతి భాష మీద పట్టు సాధించుకోవాలని కలెక్టర్ సూచించారు.మా పెద్దల ద్వారానే నేను కూడా గ్రంథాలయాలకు వెళ్ళే అలవాటును నేర్చుకున్నానని, ప్రతి ఒక్కరు కూడా గ్రంథాలయాలకు వెళ్ళే అలవాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.... ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా, అదేవిధంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విధంగా గ్రంథాలయంలో సౌకర్యాలు కల్పించామన్నారు.గ్రంథాలయ అభివృద్ధికి జిల్లా కలెక్టర్ తోడ్పాటు ఎంతో అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా బాలల హక్కులపై ప్రతిజ్ఞ డి డబ్ల్యూ ఓ కృష్ణవేణి ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థినిలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టు కున్నాయి.ఈ సందర్భంగా వ్యాసరచన, రంగోలి, మెహందీ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సురేష్ బాబు, డిపిఆర్ఓ చెన్నమ్మ, గ్రంథాలయ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# జలమండలిలో డివిజన్ల తగ్గింపు?

ఒకపక్క హైదరాబాద్ నగరం విస్తరిస్తుంటే మౌలిక వసతులు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది. కానీ దీనికి విరుద్ధంగా ప్రజలకు సేవలు అందించాల్సిన జలమండలి మాత్రం డివిజన్లను తగ్గించాలనే ఆలోచనలో ఉంది. ఔటర్ రింగ్ రోడ్ వరకు నీటి సరఫరా మరియు మరుగునీటి వ్యవస్థ అంతా కూడా జలమండలి ఆధీనంలోనే జరుగుతుంది. పౌరులకు ఏ సమస్య వచ్చినా స్థానికంగా ఉండే డివిజన్ కార్యాలయానికి వెళ్లి తమ సమస్యలను చెప్పుకునే వారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించే అవకాశం లేదు. జలమండలిలో 22 డివిజన్లు ప్రస్తుతం ఉన్నాయి. వాటిని తగ్గించే ఆలోచనలో బోర్డు ఉన్నట్టు తెలుస్తుంది. డివిజన్ ను పక్కనే ఉన్న మరో డివిజన్లో మెర్జ్ చేయడంతో చాలా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఇంజనీర్లు అభిప్రాయపడుతున్నారు. అవసరమైతే డివిజన్లను పెంచాలి, కానీ ఎందుకు తగ్గించడం అనే ప్రశ్న తలెత్తుతుంది. దీనివల్ల గందరగోల పరిస్థితులు ఏర్పడతాయనే అభిప్రాయాన్ని ఇంజనీర్లు వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ డివిజన్లను పెంచాలన్నఒకవేళ డివిజన్లను పెంచాలన్న, తగ్గించాలన్న బోర్డులోని జి ఎం, సి జి ఎం మరియు డైరెక్టర్ల అభిప్రాయాన్ని తీసుకొని ముందుకెళ్లాలి. కానీ అలా కాకుండా ఏకపక్షంగా డైరెక్టర్ల ఒపీనియన్తో ముందుకెళ్లడం సరైనది కాదని ఉద్యోగులు అంటున్నారు. ఇప్పటి వరకు ఉన్న డివిజన్లనే కొనసాగించాలని లేకపోతే దీనివలన అడ్మినిస్ట్రేషన్ మరియు రెవెన్యూ దెబ్బ తినే అవకాశం ఉందని ఇంజనీర్లు అభిప్రాయపడుతున్నారు.

# సర్వసభ్య సమావేశానికి అడిషనల్ కలెక్టర్లను, హెచ్ఎండిఏ అధికారులను పిలవాలి

**- జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్ శంకర్ యాదవ్ మరియు బీజేపీ కార్పొరేటర్ల డిమాండ్**



**హైదరాబాద్ నవంబర్20( సమయం న్యూస్).:** జిహెచ్ఎంసి పరిధిలో అనేక జిహెచ్ఎంసి ఆస్తులకు సంబంధించి పలు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపంతో ఎటువంటి లాభం లేకుండానే జిహెచ్ఎంసి ఆస్తులు బదలా ఇంచడం వల్ల జిహెచ్ఎంసి కు తీవ్ర నష్టం జరుగుతా ఉన్నది. ఉదాహరణకు మల్కాజ్గిరి పరిధిలో 400 గజాలను ఇటీవల స్థాయి సంఘ సమావేశంలో తెలంగాణ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ కేటాయిస్తూ తీర్మానం చేయడం జరిగినది, కానీ బదులుగా జిహెచ్ఎంసి ఎటువంటి లాభం కలుగలేదు, కనీసం శానిటైజేషన్ డిపార్ట్మెంట్ అనేక లేఖలు రాసిన రోడ్లపై కూడా పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ వారు తీయట్లేదు. అదేవిధంగా ఎన్టీఆర్ గ్రౌండ్స్ లో ఎంతో రెవెన్యూ జనరేట్ అవుతున్నప్పటికీ ప్రభుత్వంలో ఉన్నటువంటి వేరే శాఖలకు అప్పగించడం వల్ల జిహెచ్ఎంసికి పటు లేకుండా పోవడం,ఆదాయం కోల్పోవడం జరుగుతున్నది. అదేవిధంగా ఇటీవల మల్కాజ్గిరి మున్సిపల్ కార్యాలయానికి సంబంధించిన స్థలంలో పార్క్ నిర్మాణాన్ని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా పనులు ఆపాలతో జోనల్ కమిషనర్ కు నోటీసులు పంపడం ఉదాహరణ. అదేవిధంగా హెచ్ఎండిఏ డిపార్ట్మెంట్ నగర పరిధిలో చెరువుల పునరుద్ధీకరణ, మురుగునీటి శుద్ధికరణ తదితర పనులను చేపట్టడం మానేసి కేవలము పార్కుల పైన ప్రైవేటు వారికీ స్థలాలు కేటాయిస్తూ ఉండడం మరో ఉదాహరణ. ఈ సమస్యలపై చర్చించేందుకు ఆ సంబంధిత శాఖ వారిని కౌన్సిల్ సమావేశానికి పిలిపించాలని భారతీయ జనతా పార్టీ పక్ష నాయకుడు శంకర్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు రాసిన లేఖను కమిషనర్ ఆర్ సి కర్ణన్ గారికి జిహెచ్ఎంసి బిజెపి మీడియా ఇంచార్జ్, మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్ అందజేయడం జరిగిన.

# ఇథియోపియా ప్రతినిధి బృందం తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయాన్ని సందర్శించింది



**హైదరాబాద్, నవంబర్ 20( సమయం న్యూస్). :** ఇథియోపియా ఆరోగ్య మంత్రిత్వ శాఖ, ఇథియోపియా ఇన్వెస్ట్మెంట్ కమిషన్, ఎథియోపియన్ ఫార్మాస్యూటికల్ ప్రొక్యూర్మెంట్ సర్వీసెస్, ఇండస్ట్రియల్ పార్క్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మరియు వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులతో కూడిన ఇథియోపియా ప్రతినిధి బృందం ఈ రోజు (20-11-2025) తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (కార్యాలయాన్ని సందర్శించింది.సందర్శన సందర్భంగా, తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ తన నియంత్రణ విధానాలు, ఫీల్డ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు, రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన ఔషధాలు అందుబాటులో ఉండేందుకు తీసుకుంటున్న చర్యలను ప్రతినిధి బృందానికి వివరించింది.తెలంగాణ అమలు చేస్తున్న విధానాలు, నియంత్రణ వ్యవస్థలపై ప్రతినిధులు ప్రశంసలు తెలియజేశారు. ఈ సందర్శన ద్వారా పొందిన అనుభవాలు, తమ దేశంలోని ఔషధ నియంత్రణ వ్యవస్థ బలోపేతానికి ఉపయోగపడతాయని వారు అభిప్రాయపడ్డారు.

# ఉత్తమ సొసైటీ గా బాన్సువాడ సహకారసంఘం



**బాన్సువాడ ,నవంబర్ 20(సమయం న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఏడాది నిర్వహించే అఖిల భారత సహకార 72వ వారోత్సవాలు హైదరాబాద్‌లోని నిజాం కాలేజ్ ప్రక్కన గల సహకార సంఘ భవనంలో ఘనంగా జరిగాయి. ఉత్తమ సహకార సంఘ అవార్డులను తెలంగాణ సహకార యూనియన్ లిమిటెడ్ జాయింట్ రిజిస్టర్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ కెవిఎస్ అన్నపూర్ణ అందించారు. ఈ వారోత్సవాలు నవంబర్ 14 నుండి 20 వరకు కొన సాగాయి. కామారెడ్డి జిల్లా నుండి బాన్సువాడ సహకార సంఘం తో పాటు మరో రెండు సహకార సంఘాలు అవా ర్డులు పొందాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది జరిగే ఈ వారోత్సవాల్లో కామారెడ్డి జిల్లా నుండి బాన్సువాడ సొసైటీ చైర్మన్ ఎరవల కృష్ణారెడ్డి, చిల్లర్గి సొసైటీ ఒంటరి శపథం రెడ్డి, అడ్లూరు ఎల్లారెడ్డి సొసైటీ మర్రి సదాశివ రెడ్డి రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డులు అందుకోవడం గర్వకార ణమని అభినందించారు. సహకార సంఘాల అభివృద్ధికి చైర్మన్‌లు మరింత కృషి చేయాలని, యువత సొసైటీ చైర్మన్‌లుగా ముందుకు రావాలని సూచించారు.అనంతరం వేదికపై విజేతలైన చైర్మన్‌లకు శాలువాలతో సన్మానం చేసి అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి బాన్సువాడ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కత్తెర గంగాధర్, బాన్సువాడ మున్సిపల్ మాజీ చైర్మన్ జంగం గంగాధర్, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షులు అబ్దుల్ కలేక్, మాజీ ఎంపీపీ ఎజాస్, మాజీ జెడ్పిటిసి గోపాల్ రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ నార్ల రవీందర్, బాన్సువాడ మాజీ సొసైటీ డైరెక్టర్ పోతు రెడ్డి, తడ్కోల్ మాజీ ఉపసర్పంచ్ వెంకట రెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు సయ్యద్ మన్సూర్, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు అందే రమేష్, కట్కే రమేష్ పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

**• జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీం నగర్ నవంబర్20( సమయం న్యూస్) :** బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బాలల దినోత్సవ వారోత్సవాల ముగింపు కార్యక్రమం మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలల సంరక్షణ చట్టాల గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని అన్నారు. స్నేహితా కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ బాలల హక్కులను వివరిస్తున్నామని అన్నారు. బాల బాలికలు తమకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా 1098 హెల్ప్ లైన్ కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎలాంటి వేధింపులు ఎదురవుతున్న పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పెట్టెలో ఫిర్యాదు వేయాలని అన్నారు. బాలలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయి మాట్లాడుతూ బాల్యవివాహాలను నివారించాలని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లుగా సమాచారం ఉంటే అధికారులకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. అలాగే మత్తు పదార్థాల వినియోగం, అమ్మకం గురించి సమాచారం ఉంటే నిర్భయంగా తెలియజేయాలని అన్నారు.అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్లో పిల్లలకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సైన్ లాంగ్వేజీ లో జాతీయ గేయం పాడిన వారిని, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించిన ప్రభుత్వ క్రీడా పాఠశాల విద్యార్థులను అభినందించారు. పిల్లల దత్తతకు సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించి బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యూసి చైర్ పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గంగాధర్, మండల విద్యాధికారి ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న చిన్నారుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా

**రిమ్స్ నుంచే అన్ని అవసరమైన వైద్య సేవలు అందించేలా సమర్థమైన ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు.**




గురువారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో అపోలో, ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిన్నారుల ఉచిత గుండె జబ్బుల వైద్య శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. రిమ్స్‌లోని డీఈఐసి కేంద్రంలో హైదరాబాద్ అపోలో కార్డియాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పీడియాట్రిక్ కార్డియాలజీ శిబిరానికి ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 150 మంది చిన్నారులు హాజరయ్యారు. వైద్యులు వారికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి శస్త్రచికిత్సల నిమిత్తం హైదరాబాద్‌కు రావాలని సూచించారు. ఒక చిన్నారి తల్లి హైదరాబాద్‌లో పరీక్షలు చేయించుకుంటున్నట్లు తెలుసుకున్న కలెక్టర్, రిమ్స్‌లోనే అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని ఇక్కడే వినియోగించుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పేద కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించేలా రిమ్స్‌లోనే వైద్య చికిత్సలు అందించాలని అన్నారు. వైద్య పరీక్షలు, మందులు, స్కానింగ్, 2డీ ఈకో వంటి సేవలు రిమ్స్‌లోనే అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పేదలకు నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించేందుకు అపోలో ఆసుపత్రి ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. మందులు, స్కానింగ్ తదితర పరీక్షల కోసం పేదలపై భారం తగ్గేలా ప్రణాళికలు రూపొందించి, రవాణా ఖర్చులు మాత్రమే అయ్యే విధంగా హైదరాబాద్‌కు పంపేలా వ్యవస్థను రూపొందించాలని రిమ్స్ డైరెక్టర్‌కు సూచించారు. అవసరమైతే ఆసుపత్రి యాజమాన్యానికి లేఖ రాసి, రిమ్స్‌లోనే పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, వైద్యులు వై.సి. శ్రీనివాస్, సమీయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ఘన స్వాగతం



**నిర్మల్ నవంబర్( సమయం న్యూస్) :** ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈ నెల 18వ తేదీన జరిగిన కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ చేతుల మీదుగా ప్రతిష్టాత్మక "జల సంచయ్ - జన భాగీదారి" అవార్డును స్వీకరించి గురువారం కలెక్టరేట్ కు వచ్చిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు కార్యాలయం ప్రధాన గేటు వద్ద అధికారులు పూలమాలలు, బ్యాండ్ మేళాలతో ఘన స్వాగతం పలికారు. పలువురు అధికారులు కలెక్టర్‌కు పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో కలెక్టరేట్ ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ స్థాయి జల అవార్డుల్లో భాగంగా దక్షిణాది రాష్ట్రాల విభాగంలో నిర్మల్ జిల్లా రెండవ స్థానంలో నిలవడం గర్వకారణమని అన్నారు. జిల్లాకు కోటి రూపాయల రివార్డు లభించడం విశేషమని తెలిపారు. అధికారుల సమిష్టి కృషి, ప్రజల విలువైన భాగస్వామ్యంతోనే ఈ ఘనత సాధ్యమైందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో పని చేసి, జిల్లాకు మరిన్ని ప్రతిష్టాత్మక అవార్డులు సాధించేందుకు కృషి చేయాలని అధికారులకు పిలుపునిచ్చారు. జిల్లాకు ఇంతటి ప్రతిష్టాత్మక అవార్డు రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమైంది. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో పాటు అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలెక్టర్‌ను కలిసి పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# కుమార్తె , భార్యపై కత్తితో దాడి : భార్య మృతి







**ఖమ్మం నవంబర్ 20 :( సమయం న్యూస్ ) :** తన కుమార్తెతో పాటు తన భార్యపై కూడా కత్తితో భాస్కర్ అనే వ్యక్తి గురువారం ఉదయం 7 గంటల సమయంలో దాడికి పాల్పడిన సంఘటనలో భార్య అక్కడికక్కడే మృతి చెందింది. జిల్లా కేంద్రమైన ఖమ్మం నగరంలో గట్టయ సెంటర్ లో ని జిఎంఆర్ ఫంక్షన్ హాలు లో మృతురాలు గోగుల వాణి ( 36) పని చస్తోంది. ఖమ్మం జిల్లాలోని చింతకాని మండలంలో గల నేరడ గ్రామస్తురాలు ఆమె. దాడికి పాల్పడి కత్తితో మెడనుకోసిన నిందితుడు భాస్కర్ ఆమె భర్త. వీరిద్దరికీ 9వ తరగతి చదువుతున్న కుమార్తె హర్షవర్ధిని , ఏడవ తరగతి చదువుతున్న మహేంద్ర అనే పిల్లలు ఉన్నారు. గత కొంతకాలంగా భార్యాభర్తలు విడిగా ఉంటున్నట్లు సమాచారం. ఈరోజు ఉదయం ఏడు గంటలకు జరిగిన ఈ సంఘటన తో ఆ ప్రాంతంలో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మృతురాలి బంధువులు అందించిన సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని , కేసు నమోదు చేసుకొని , దర్యాప్తు ప్రారంభించారు. కాగా నిందితుడు భాస్కర్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

# చెప్పదా చేవెళ్ల..!



బండెడాశల బతుకు బాటల
మోసుకుంటా మసక మబ్బుల
బయలెల్లిన బస్సు రథం..
ఓర్వలేని విధి సైతం
చెరిపేసే తల రాతలు..
కళ్లు మండి భగవంతుడు బలిగొన్నడు బంధాలను మిగిల్చినడు గర్భశోకాన్ని..!
మూడు తరాల బంధాలు ముగ్గురక్కచెల్లెళ్లు
రాయి నలిపిన చేయి కథ చెప్పదా చేవెళ్ల..!
చేతులెత్తె ఆర్థనాదం
పెద్దోళ్ల సంతాపం
సానుభూతి లాంఛనాలు
పరిహారం ఏం లాభం
తిరిగొస్తరా ఆ బిడ్డలు..!
నలుదిక్కుల చలాన్లుంటే నడిమిట్ల గుంతలేందని
నల్ల బ్యాడ్జి నిలదీస్తే..
మతిలేని తనిఖీలతో
అతివేగమని బదులిచ్చే..!
వచ్చాక 'రీల్' అంటే ఎదురుచూసే మీ స్నేహం.. కడచూపు నోచుకోక సొమ్మసిల్లిన కళాశాల..
మీ అల్లరి జ్ఞాపకాలు
ఎప్పటికీ మా గుండెల..!
అన్నింటికి అదే దారి
ఎన్నెన్నో ప్రమాదాలు
అవే అవే కారణాలు
కలగదేమి కనువిప్పు?
తెల్లచొక్కాల అబద్ధాలు సరిదిద్దవా నీలి అక్షరాలు..
ఏ రంగులు పులుముకున్న ఎందాక చీకటి పయనం..
పూడిస్తే మీ తలలు
మారవ మా తల రాతలు..!
చున్ని నెత్తికేసి నిలబడితే.. కొంగు నడుముకు జెక్కి అడుగేస్తే..
షికెలిప్పి శివమెత్తితే.. పరుగెట్టదా నిర్లక్ష్యం?
ఇగ, ఇకనైనా..
గుంతలు నేర్పే పాఠాలు చెవికెక్కేలా..
రక్తదాహం కోరే రహదారుల మెత్తేలా..
నీతి లేని
నేతల ముసుగులు తొలగేలా.. తెల్లకారుల అల్లె కథల
గుంజి గుంజి నిలదీద్దాం పగబట్టి ప్రశ్నిద్దాం..
-సురేంద్ర బండారు
(90108 47120)

# పి సి సి అధ్యక్షుడిని కలిసిన ఆగ్రో చైర్మన్ బాలరాజు



**బాన్సువాడ,నవంబర్ 20 (సమయం న్యూస్) :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు గురువారం గాంధీ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పలు అంశాలపై అధ్యక్షుడితో బాలరాజు చర్చలు జరిపినట్టు సమాచారం. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు అబ్దుల్ ఖాలేక్, మాజీ ఎంపీపీ ఎజాస్, మాజీ జెడ్పిటిసి గోపాల్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ నార్ల రవీందర్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ మన్సూర్, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు అందే రమేష్ పాల్గొన్నారు.

# శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రేరణ ఎఫ్ ఎల్ ఎన్ ప్రోగ్రాం పైన ఉపాధ్యాయులకు శిక్షణ.






**పరిగి మున్సిపల్(మం),నవంబర్,20(సమయం న్యూస్) :** శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తేజస్ నెట్వర్క్ సహకారంతో పరిగి మండలంలోని మొత్తం 50 ప్రభుత్వ పాఠశాలలో ప్రేరణ ఎఫ్ఎల్ఎన్ కారిక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛందంగా అందించి ఎఫ్ ఎల్ ఎన్ పుస్తకాలను విద్యార్థులు ఉపయోగించే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని పరిగి మండల విద్యాధికారి ఎం గోపాల్ ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి మొత్తం 45 మంది ఉపాధ్యాయులు హాజరైనారు. విద్యార్థుల సామర్థ్యాలను పెంచడానికి నిరంతరం కృషి చేస్తున్నటువంటి శిక్షణ ఫౌండేషన్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో ఆర్పి లుగ వెంకట ప్రసాద్ మరియు స్వప్న పాల్గొనడం జరిగింది. అదేవిధంగా శిక్షణ ఫౌండేషన్ సీనియర్ మెంటర్ అయినటువంటి తులజప్ప, మెంటర్స్ కవిత. రమేష్ లు పాల్గొనడం జరిగింది.

# నీటి సంరక్షణ పై భవిష్యత్తు ఆధారపడి ఉంది

- చంద్రశేఖర్, అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థల).
- నీటి సంరక్షణ కు పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో 10 గ్రామాలు ఎంపిక.
- నీటి సంరక్షణ, వర్షపు నీరు నిలువ, వీటిని పొదుపుగా వినియోగించడం, ఇంకుడు గుంతల నిర్మాణం పై
- ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలి.



**సంగారెడ్డి నవంబర్20( సమయం న్యూస్) :** నీటి సంరక్షణ మీదనే భవిష్యత్తు ఆధారపడి ఉందని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు ) చంద్రశేఖర్ అన్నారు. గురువారం సంగారెడ్డి కలెక్టరేట్లో నీటి సంరక్షణ కార్యక్రమంలో భాగంగా వాటర్ హెడ్ ఆధ్వర్యంలో నీటి సంరక్షణ సుస్థిరమైన నీటి భవిష్యత్తు కోసం సంఘాలను సాధికారపరచడం కార్యక్రమంలో జిల్లాలో ఎంపిక చేసిన పది గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవో, ఎంపీడీవోలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన ప్రారంభ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానవజాతి మనుగడకు నీరే ప్రధాన కారణం అన్నారు ఎక్కడైతే నీరు పుష్కలంగా లభిస్తుందో ఆ ప్రాంతాలు అభివృద్ధి పరంగా ముందు వరుసలో ఉన్నాయన్నారు. తాగునీరు,సాగునీరు ప్రస్తుతం మన ప్రాంతంలో పుష్కలంగా లభిస్తున్నప్పటికీ నీటి వృధా కారణంగా నీటిని పొదుపుగా వాడుకోకపోవడం కారణంగా తగినంత నీటిని నిలువ చేయకపోవడం కారణంగా భూగర్భ జలాల అత్యధికంగా వినియోగించడం తదితర కాలంలో భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడి సమస్య ఉందని సమస్యలు తలెత్తకుండా ఉండడం కోసం ప్రభుత్వం నీటి నిలువ ప్రాధాన్యతను ప్రజలకు వివరించడం కోసం వాటర్షెడ్ ఇలాంటి ఎన్నో కార్యక్రమాలను చేపట్టి అవగాహన కల్పిస్తుంది అన్నారు. మన ఊరిలో , మన ఇంట్లో కురిసిన ప్రతి వర్షపు చినుకు మనదే, మన ఇంటి ఆవరణలో , మన ఊరి ఆవరణ భూమిలోకి ఇంకెలా చేయడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతా యన్నారు .నీటి వృధాను సాధ్యమైనంత వరకు తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం వర్షపు నీరు ఆధారంగా చెరువులు కుంటలు నిండి భూగర్భ జలాలు పెరుగుతున్నాయి అన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం వృధా నీటిని ఇంకుడు గుంతల్లోకి మళ్లించడం గ్రామంలోని మురుగు కాలువల నీటిని పెద్దపెద్ద ఇంకుడు గుంతలుఏర్పాటు చేసి భూమిలోకి ఇంకెలా చేయడం వల్ల భూగర్భ జలాలు పెంపొందించవచ్చున్నారు. చెరువులు, కుంటల లో నీరు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కొన్ని పరిశ్రమలు వర్షం పడిన సమయంలో నీటి వ్యర్థాలను చెరువులు, కుంటలు వాగులలోకి వదిలి నీటిని కలుషితం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి కంపెనీలను గుర్తించి పంచాయతీ కార్యదర్శి ఆ కంపెనీలకు నోటీసులు ఇవ్వడం కఠిన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఎంపిక చేసిన పది గ్రామాలలో ప్రభుత్వ విద్యా సంస్థలు, ప్రభుత్వ వసతి గృహాలు,ప్రభుత్వ కార్యాలయంలో నీటి వసతి కల్పించడం, నీటి వృధాను అరికట్టడం, ఆయా గ్రామాల ప్రజలకు నీటి పొదుపుగా వాడుకునేలా చూడడం భూగర్భ జలాల పెంపు కోసం నీటిని సంరక్షించేలా చర్యలు తీసుకోవడం పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి భవిష్యత్తులో తాగునీరు సాగునీరు కోసం ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండాలంటే ఇప్పటినుంచే నీటిని సంరక్షించాలన్న విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో మల్కాపూర్, గుంతపల్లి, హరిదాస్పూర్, బాచుపల్లి, మన్సాన్పల్లి, గొల్లపల్లి, మారేపల్లి, కొండాపూర్, మహమదాపూర్ ఇతర 10 గ్రామాలను జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి నీటి సంరక్షణకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డి ఆర్ డి ఓ బాలరాజు, భూగర్భ జల అధికారా. జి. మోహన్ డిప్యూటీ డైరెక్టర్, డి పి ఓ సాయి బాబా,కార్ల్సబర్గ్ మిస్టర్ సీసీ అల్పట్ బ్రూవరీ హెడ్, గ్రౌండ్ వాటర్ వాటర్ ఎయిడ్ సునీల్ కుమార్ సీనియర్ టెక్నికల్ అడ్వైజర్, వాటర్ ఎయిడ్ ఆల్విన్ మనీష్ షా,వాటర్ ఐడ్ జిల్లా ఇంచార్జ్ శ్రీనివాసరావు, ఎంపీడీవోలు ఏపీవోలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పది లో శత శాతం ఫలితాలు సాధించాలి

- వెనక బడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి.
- విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందించాలి
- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.







**నారాయణపేట, నవంబర్,20(సమయం న్యూస్) :** నారాయణ పేట జిల్లాలో ఈ సారి పదో తరగతి ఫలితాలను శత శాతం సాధించేందుకు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లాలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో 10వ తరగతి పరీక్షల గురించి, పాఠశాలల్లో పూర్తయిన సమ్మేటివ్ అసెస్మెంట్ -1 (SA1) పరీక్షా ఫలితాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్ ఏ - 1పరీక్షల్లో వివిధ సబ్జెక్టులలో ఎక్కువ శాతం ఉత్తీర్ణత, తక్కువ శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల పై చర్చి ంచారు. తక్కువ ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కారణాలు అడిగి వివరణ కోరారు. చాలా మంది హెచ్ ఎం లు ఉపాధ్యాయుల కొరత ప్రధాన కారణంగా జవాబిచ్చారు. అయితే ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో వీలున్న పరిస్థితులను బట్టి స్థానికంగా వేరే వారిని నియమించాలని డి ఈ ఓ కు కలెక్టర్ సూచించారు. అలాగే విద్యార్థుల ఉపస్థితి పైన సమీక్షించారు. ఎక్కువ సంఖ్యలో అనుపస్థితిలో ఉన్న విద్యార్థుల గురించి వెంటనే వారి తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులు ఉపస్థితి మెరుగు పడటానికి చర్యలు తీసుకోవాలని హెచ్ ఎం లను ఆమె ఆదేశించారు. అదేవిధంగా వివిధ సబ్జెక్టులలో ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ కావడం పై ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో హెచ్ ఎం లు సమీక్షలు జరిపి కారణాలు విశ్లేషించి ఫలితాలు మెరుగు పర్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో అపార్ ఐడీల జనరేషన్ చాలా తక్కువ స్థాయిలో ఉందని, వెంబడే అందరూ ఎంఈఓ లు వంద. శాతం అపార్ నమోదుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పదో తరగతిలో డీ గ్రేడ్ లో ఉన్న విద్యార్థులను సీ గ్రేడ్ కు,సీ గ్రేడ్ లో ఉన్న విద్యార్థులను బి గ్రేడ్ కు, అలాగే బి గ్రేడ్ లో ఉన్న విద్యార్థులను ఏ గ్రేడ్ కు వచ్చేలా వారి నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని పెంపొందించాలని కలెక్టర్ సూచించారు. మొత్తానికి ఈ సారి పదో తరగతి పరీక్షా ఫలితాలలో నారాయణ పేట జిల్లా వంద శాతం సాధించాలని కలెక్టర్ పునరుద్ఘాటించారు. ఈ సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డీ ఈ ఓ గోవింద రాజులు, డీ ఈ ఓ కార్యాలయ అధికారులు విజయ్ సాగర్, రాజేందర్, అన్ని మండలాల ఎంఈఓ లు, జీ హెచ్ ఎం లు, హెచ్ ఎం లు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించే రైస్ మిల్లర్లకే ధాన్యం కేటాయింపు

- అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి




**ఖమ్మం, నవంబర్ 20:(సమయం న్యూస్ ) :** నిబంధనలు పాటించే రైస్ మిల్లర్లకే ధాన్యం కేటాయించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. అదనపు కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలుపై రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఆశించిన స్థాయిలో సజావుగా జరగడం లేదని తెలిపారు. జిల్లాలో ఉన్న 71 రైస్ మిల్లుల్లో ఇప్పటి వరకు 63 రైస్ మిల్లర్లు మాత్రమే బ్యాంకు గ్యారంటీలు సమర్పించారని, మిగిలిన 8 మిల్లులకు ఎట్టి పరిస్థితులలో ధాన్యం కేటాయింపులు జరగవని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. 8 మిల్లులు గతంలో పెండింగ్ ఉన్న రైస్ డెలివరీ పూర్తి చేసి, బ్యాంక్ గ్యారంటీలు సమర్పిస్తే ఖరీఫ్ సీజన్ ధాన్యం కేటాయింపు పై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. 10 శాతం బ్యాంకు గ్యారంటీ, పెండింగ్ యాసంగి రైస్ డెలివరీ పూర్తి చేయని పక్షంలో రైస్ మిల్లులకు గోడౌన్ ట్యాగ్ చేయడం జరగదని అన్నారు. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ ధాన్యం తీసుకున్న ప్రతి రైస్ మిల్లర్ తప్పనిసరిగా యాసంగి కేటాయింపు తీసుకోవాల్సి ఉంటుందని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి సీజన్ లో 2 నుంచి 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైస్ మిల్లర్లకు కేటాయించాల్సి ఉంటుందని, దీనికి అనుగుణంగా మిల్లర్లు కొల్లేటరల్ బ్యాంకు గ్యారంటీ సిద్ధం చేసుకోవాలని అన్నారు. రైస్ డెలివరీకి సంబంధించి గోదాముల సమస్య పరిష్కారం కోసం నూతన గోదాముల నిర్మాణం చేపట్టామని అన్నారు. రైస్ మిల్లులకు ఉన్న వివిధ సమస్యల సంబంధించి దరఖాస్తులు అందిస్తే ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని అన్నారు. సమావేశంలో జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు బొమ్మ రాజేశ్వర రావు మాట్లాడుతూ ప్రతి సీజన్ 1,70,000 మెట్రిక్ టన్నులకు పైగా బియ్యం సరఫరా చేయాల్సి ఉంటుందని, ఇక్కడ గోదాముల ప్లేస్ సరిపోయేంత లేదని అన్నారు. గోడౌన్ సమస్య వల్ల దూర ప్రాంతాలకు బియ్యం డెలీవరి సమయంలో రవాణా ఖర్చులు అందించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, సంబంధిత అధికారులు, మిల్లర్ లు, పాల్గొన్నారు.

# సజావుగా పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలి

## ● రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని

**ఖమ్మం, నవంబర్ 20:( సమయం న్యూస్ ) :** గ్రామపంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి, సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని అన్నారు.గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ, ఓటర్ జాబితా తయారీపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్, జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొనగా, కలెక్టరేట్ నుంచి పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని మాట్లాడుతూగ్రామ పంచాయతీ ఎన్నికలు త్వరలో నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయించిందని, సజావుగా ఎన్నికలు జరిగేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. 3 విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలను కుంటే, ప్రతి ఫేజ్ లో ఏ మండలాలు ఎన్నికలు జరగాలో జిల్లా వారీగాపణాళికలు అందించాలని అన్నారు.పంచాయతీ తుది ఓటర్ జాబితాకు సంబంధించి ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించి, ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించి పోలింగ్ కేంద్రాలు, ఫోటోలతో కూడిన ఓటర్ జాబితా ప్రచురణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత ఎంసిసి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ఎంసిసి ఉల్లంఘనపై వచ్చే ప్రతి ఫిర్యాదు




పరిష్కారానికియంత్రాంగం సిద్ధం చేసుకోవాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అధికారులతో మాట్లాడుతూహగ్రామ పంచాయతీ, వార్డులకు సంబంధించి రిజర్వేషన్ ప్రక్రియ ఖరారు చేసి చెక్ చేసుకోవాలని, ప్రతి వర్గంలో మహిళలకు రిజర్వేషన్ 50 శాతం అమలు కావాల్సి ఉంటుందని అన్నారు. జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా పంచాయతి అధికారి ఆశాలత, జెడ్పి డిప్యూటీ సిఇఓ నాగపద్మజ, డివిజనల్ పంచాయతీ అధికారులు విజయలక్ష్మి, రాంబాబు, ఎన్నికల విభాగం సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# వికారాబాద్ జిల్లా కోర్టు సంచలన తీర్పు


## భార్య, ఇద్దరు పిల్లల హత్య కేసులో నిందితుడికి ఉరిశిక్ష, 10,000 రూపాయల జరిమానా.

**వికారాబాద్, నవంబర్,20(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కోర్టు గురువారం ఒక చారిత్రక తీర్పును వెలువరించింది. 2019 సంవత్సరంలో తన భార్యతో పాటు ఇద్దరు పిల్లలను అత్యంత కిరాతకంగా హత్య చేసిన కేసులో నిందితుడైన గురు ప్రవీణ్ కుమార్‌కు మరణశిక్ష (ఉరిశిక్ష),10,000 రూపాయల జరిమానా (జరిమానా చెల్లించని పక్షంలో: అదనంగా 6 నెలల కఠిన కారాగార శిక్ష అనుభవించాలి) విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ %డ% సెషన్స్ జడ్జి డాక్టర్ సున్నం శ్రీనివాస్ రెడ్డి సంచలనాత్మక తీర్పు ఇవ్వడం జరిగింది. ఇట్టి వివరాలను జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి వెల్లడించారు.కేసు వివరాల్లోకి వెళితే, శేరిలింగంపల్లికి చెందిన గురు ప్రవీణ్ కుమార్, చాందినిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే, చాందినికి అంతకుముందే వివాహం జరిగి ఆయాన్ బాబు అనే కుమారుడు ఉన్నాడు. అయినప్పటికీ, తమ బిడ్డేనని అంగీకరించి ఈ దంపతులు వికారాబాద్‌కు మకాం మార్చారు. వారికి ఏంజెల్ అనే పాప కూడా జన్మించింది. అయితే, భార్య చాందిని మొబైల్ ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడుతోందనే అనుమానం గురు ప్రవీణ్ కుమార్‌కు బలంగా ఉండేది.ఇట్టి విషయంలో చాలా సార్లు గొడవలు జరిగినాయి. అయినాను మారకపోవడం తో భార్య పైన అనుమానం పెంచుకొని ఈ అనుమానం ఎలాగైనా భార్యను చంపాలనే ఉద్దేశం తో 04.08.2019రోజు రాత్రి పిల్లలు నిద్రించిన తర్వాత కోపంతో తన భార్య చాందినిని ఇనుప రాడ్డుతో కొట్టి చంపాడు. అనంతరం, ఆయనే ఇద్దరు పిల్లలైన ఆయాన్ (బాబు) ను రాడ్డు తో కొట్టి, ఏంజెల్ (పాప)ను గొంతు పిసికి దారుణంగా హత్య చేశాడు .ముగ్గురిని హత్య చేసిన తర్వాత నిందితుడు గురు ప్రవీణ్ కుమార్ తను రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకొని రైలు పట్టాలవైపు వెళుతున్నాడు. మార్గ మధ్యలో వికారాబాద్ పోలీస్ స్టేషన్ కనిపించగా, తాను చేసిన నేరాన్ని చెప్పి వెళ్దామని స్టేషన్‌కు వచ్చాడు. అక్కడ విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకొని, నేరం జరిగిన ప్రదేశానికి వెళ్లి పరిశీలించిన తర్వాత మొదటి ఐఓ అప్పటి టౌన్ ఇన్స్పెక్టర్ వి. శ్రీనివాస్ రావు తక్షణమే క్రైమ్ నెంబర్ 247/2019, సెక్షన్ 302 ఐపీసీ క్రింద కేసు నమోదు చేశారు. అనంతరం 2వ ఐఓ అప్పటి వికారాబాద్ సబ్ డివిజన్ డీఎస్పీ పి. సీతారాం, 3వ ఐఓ అప్పటి వికారాబాద్ సబ్ డివిజన్ డీఎస్పీ ఏ. సంజీవ రావు కేసును పటిష్టంగా, లోపాలు లేకుండా దర్యాప్తు పూర్తి చేశారు. దర్యాప్తు పత్రాలు, సాక్ష్యాలను కోర్టులో సమర్పించగా, వాదోపవాదాలు విన్న ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ %డ% సెషన్స్ జడ్జి డాక్టర్ సున్నం శ్రీనివాస్ రెడ్డి నేరం యొక్క తీవ్రతను పరిగణనలోకి తీసుకొని నిందితుడు ప్రవీణ్ కుమార్‌కు ఉరిశిక్ష మరియు10,000 రూపాయల జరిమానా (జరిమానా చెల్లి ంచని పక్షంలో: అదనంగా 6 నెలల కఠిన కారాగార శిక్ష అనుభవించాలి) విధిస్తూ ఈరోజు చారిత్రక తీర్పును ప్రకటి ంచారు.ఈ కేసులో నిందితుడికి అత్యంత కఠినమైన శిక్ష పడేందుకు కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) పి. సుధాకర్ రెడ్డిని, ఐఓలు: అప్పటి ఇన్స్పెక్టర్ వి. శ్రీనివాస్ రావు, అప్పటి డీఎస్పీలు పి. సీతారాం, ఏ. సంజీవ రావు, ప్రస్తుత అధికారులు అయిన వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, టౌన్ ఇన్స్పెక్టర్ భీమ్ కుమార్,బ్రీఫింగ్ ఆఫీసర్ గిరన్న, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్ ఎల్. నరేందర్, లైసానింగ్ ఆఫీసర్ యస్. శ్రీనివాస్ (ఎస్సై), ) ఇ. చంద్ర శేఖర్ (ఏ ఎస్సై) జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

# ఈ నెల 24 వ తేదీన కొడంగల్ కు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాక

- ఎన్కెపల్లి గ్రామ శివారు నందు అక్షయ పాత్ర కిచెన్ షెడ్ భూమి పూజ కై సస్థలం,మ్యాపు ను పరిశీలించిన కలెక్టర్
- దుద్యాల మండలం హ్యాకింపేట లో ఎడ్యుకేషన్ హబ్ భూమి పూజ ఏర్పాట్లను పరిశీలన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**కొడంగల్ మున్సిపల్,(మం)నవంబర్,20(సమయం న్యూస్)** ఈ నెల 24 వ తేదిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి వికారాబాద్ జిల్లా కొడంగల్ కు విచ్చేయుచున సందర్భంగాకొడంగల్ మున్సిపల్ పరిధిలో గల ఎంకే పల్లిగ్రామ శివారు నందు గల రెండు ఎకరాల భూమిలో అక్షయ పాత్ర కిచెన్ షెడ్ భూమి పూజ కోసం సస్థలం మరియు మ్యాపును జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ల తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పరిశీలించారు.గురువారం సాయంత్రం కొడంగల్ శివారులో గల ఎన్కెపల్లిలో రెండు ఎకరాలలో అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్ షెడ్ భూమి పూజ చేయనున్న సందర్భంగా స్థల పరిశీలన చేశారు.ఈ సందర్భంగా సంబంధిత అధికారు లతో చర్చించి ఇట్టి స్థలానికి సంబంధించిన మ్యాప్ ను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం హకీంపేట్ శివారు నందు ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాట్లను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ కలెక్టర్ హర్షి చౌదరి, కొడంగల్ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్, ఆర్ అండ్ బి అధికారి శ్రీధర్ రెడ్డి, తహసిల్దార్ రాంబాబు, అక్షయపాత్ర ఫౌండేషన్ చైతన్య శరత్ తదితరులు, అధికారులు పాల్గొన్నారు.










# నగరాభివృద్ధికి నిధులు కేటాయించమంటే బీజేపీ కార్పొరేటర్ల పై పాశవిక దాడి చేయించిన మేయర్

## ● బి జె పి కార్పొరేటర్ లు నిరసన.

**హైదరాబాద్ నవంబర్20( సమయం న్యూస్).:** నగరంలో గత అనేక సంవత్సరాలుగా పేరుకు పోయినటువంటి అనేక సమస్యల పైన కార్పొరేటర్లు ఇచ్చినటువంటి వినతి పత్రాలపైన సమాధానం చెప్పాలని,అధికార పార్టీ లేదా స్టాండింగ్ కమిటీ సభ్యులకే కాకుండా నగరంలో అన్ని డివిజన్లోకి నిధులు కేటాయించాలని చెప్పి భారతీయ జనతా పార్టీ కార్పొరేటర్లు ఈరోజు జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సమావేశం ముందు బైఠాయించడం జరిగినది. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వట్లేదు అంటూ చెప్పేటువంటి కాంగ్రెస్ పార్టీ, కేంద్రం నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ కింద ఇచ్చినటువంటి 113 కోట్ల రూపాయలను 38 చెరువుల పునరుద్ధీకరణకు వాడాల్సి ఉండగా మరి నగర మేయర్ రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులు ఎందుకు వాడట్లేదు అన్ని చెరువుల పునరుద్ధీకరణ ఎందుకు చేయట్లేదని ప్రశ్నించడం జరిగినది. మా ప్రశ్నలకు సమాధానాలు ఇస్తే వెళ్ళిపోతామని చెప్పినా, కనీసం నగరం మేయర్ కు జిహెచ్ఎంసి లో ఎన్ని డిపార్ట్మెంట్లు ఉన్నాయో చెప్పినా వెళ్లిపోతామని చెప్పినా ఏ యొక్క సమాధానం ఇవ్వకుండా పాసవికంగా 100 మంది పోలీసుల పెట్టి అత్యంత క్రూరంగా పాసవికంగా బిజెపి కార్పొరేటర్ల పైన మేయర్, మరియు కాంగ్రెస్ పార్టీ దాడికి పాల్పడింది. పోలీసుల ద్వారా అరెస్టు చేయించి చిక్కడపల్లి థానా కు తరలించడం జరిగినది. నగరంలో అసలు పెత్తనం ఎవరిదో అర్థం కావట్లేదు, జిహెచ్ఎంసి,హెచ్ఎండిఏ,జిల్లా కలెక్టర్లు, హైడ్రా ఇలా ఏ సంస్థకు ఆ సంస్థ నుంచి పెత్తనాలతో పరిపాలన పూర్తిగా అయోమయంలో పడింది.ఈ కార్యక్రమం లో బీజేపీ కార్పొరేటర్లు మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్, సరూర్ నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి, మూసాపేట్ కార్పొరేటర్ మహేందర్, గోషా మహల్ కార్పొరేటర్ లాల్ సింగ్ బీజేపీ సీనియర్ నాయకులు గౌలికర్ ఆనంద్, ప్రభు గుప్తా, శ్రీకాంత్, నందు యాదవ్, వీరేష్, నాని, సుధీర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల్లో పుస్తక పఠనం ఆసక్తి నెలకొల్పాలి

## ● డిపిఆర్ ఎం ఏ గౌస్



**ఖమ్మం, నవంబర్ 20: ( సమయం న్యూస్ ) :** పిల్లల్లో పుస్తక పఠనం ఆసక్తి నెలకొల్పాలని డిపిఆర్ఓ ఎం.ఏ. గౌస్ అన్నారు. డిపిఆర్ఓ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం జరిగిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిపిఆర్ఓ ఎం.ఏ. గౌస్ మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వల్ల మన వ్యక్తిత్వం పెరుగుతుందని అన్నారు. చిన్నతనం నుంచే పిల్లల్లో పుస్తక పఠనం అలవాటు పెంచాలని అన్నారు. పుస్తకాలు జ్ఞాన ధనాగారాలని, పుస్తకాలు లభించే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గ్రంథాలయంలో ఉద్యోగార్దులకు అవసరమైన అన్ని పుస్తకాలు ఏర్పాటు చేశామని, అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. పుస్తకాలు మనసుకు దివిటిలని, భవిష్యత్ తరాలు జ్ఞానం వైపు నడవాలంటే ప్రతి గ్రామంలో, ప్రతి పట్టణంలో గ్రంథాలయాలు చైతన్య కేంద్రాలుగా నిలవాలని డిపిఆర్వో తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతుల ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కటుకోజ్వుల రమేష్ రచించిన మరో గ్రంథాలయ ఉద్యమం కవితను డిపిఆర్వో ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. కరుణ కుమారి, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కెవిఎస్ఎల్ఎన్. రాజు, కార్యదర్శి ఎం.డి. ఇమామ్, ఉద్యోగులు జె. భాస్కర్, సిహెచ్. శ్రీనివాస్, వి. అఖిల్, ఎం. రోహిత్, ఎస్. లలిత కుమారి, కె.విజయకుమారి, బి. నాగలక్ష్మి, ఎం. సుమలత, కె. రవిబాబు, బి. బాబు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ ఆదేశాల మేరకు బాల సభ నిర్వహించిన ఎం పి ఓ- జయపాల్ రెడ్డి



**కొడంగల్ మున్సిపల్(మం)నవంబర్,20(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం లోని అప్పాయిపల్లి గ్రామ శివారులోగల మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్సియల్ కళాశాలలో కలెక్టర్ అదేశాలమేరకు బాల సభ నిర్వహించిన మండల పంచాయతీ అధికారి ఆధ్వర్యంలోని పంచాయతీ కార్యదర్శులు. బాల సభలో పిల్లలతో డ్రాయింగ్, క్రీడలు మరియు ఉపన్యాసాలు నిర్వహించి తరువాత గ్రామాలలో బాలల సమస్యలు, వారి అవసరాలకు గ్రామ పంచాయతీలు మరియు ప్రభుత్వాలు చేయవలసిన పనులను తెలుసుకోవడం జరిగింది. బాలలు అందించిన సమాచారాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపించడం జరుగుతుంది.ఈ గ్రామ సభల ద్వారా చిన్న పిల్లల గొంతును కూడా విని వారి సమస్యల పరిష్కారానికి స్థానిక సంస్థలు మరియు ప్రభుత్వానికి తగిన సమాచారం లభిస్తుంది.ఇట్టి కాయక్రములో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు బాలరంగా చారి, రమేష్ కుమార్, కల్పన, లావణ్య, మధు, ఆశప్ప, ఉదయ్ కుమార్, చైతన్య కుమార్ మరియు ఏ ఎన్ ఎమ్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో అనాధ వృద్ధురాలికి అధికారుల అండ.

- జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి.
- వృద్ధ మహిళ ఆశ్రమానికి తరలింపు



**సంగారెడ్డి నవంబర్20( సమయం న్యూస్).:** సంగారెడ్డి పట్టణం లోని 23వ వార్డులో నివాసం లేక ఒంటరిగా జీవిస్తున్న అనాధ వృద్ధ మహిళ పరిస్థితిని స్థానికులు జిల్లా అధికారులు దృష్టికి తీసుకొని రావడంతో, అధికారులు వెంటనే స్పందించి వృద్ధ మహిళలకు ఆశ్రయం కల్పించారు. చలి తీవ్రత పెరుగుతున్న పరిస్థితుల్లో ఆమె ఆరోగ్యం ప్రమాదంలో పడకముందే చర్యలు తీసుకోవడం ప్రత్యేకంగా కొనియాడదగిన అంశం.

అధికారుల చర్యలు సంగారెడ్డి పట్టణంలోని 23వ వార్డులో వృద్ధ మహిళ పరిస్థితిని గమనించిన 23వ వార్డు మాజీ కౌన్సిలర్ కూన సంతోష్, రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ కూన వేణు ఈ విషయాన్ని మహిళా, శిశు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖకు తెలియజేశారు. సమాచారం అందుకున్న జిల్లా సంక్షేమ అధికారి లలితకుమారి, తక్షణ చర్యలకు ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి సతీష్‌ను ఆదేశించారు.

వృద్ధ మహిళ ఆశ్రమానికి తరలింపు: జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు సతీష్ సంఘటన స్థలానికి చేరుకుని ఆమె వివరాలు సేకరించిన తర్వాత, అమీన్‌పూర్‌లోని మహిమ మినిస్ట్రీస్ నిర్వహిస్తున్న వృద్ధుల అనాధ ఆశ్రమానికి వృద్ధ మహిళను తరలించారు. అక్కడ మహిళకు అవసరమైన వైద్యం, భోజనం మరియు సంరక్షణ అందుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కూన సంతోష్, TYSS రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ కూన వేణు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజమే మనందరి లక్ష్యం

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**హన్మకొండ నవంబర్20( సమయం న్యూస్) :** డ్రగ్స్ రహిత సమాజమే మనందరి లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణకై చేపట్టిన చర్యల్లో భాగంగా, మత్తు పదార్థాల వినియోగించే వారితో పాటు, వీటిని విక్రయాలకు పాల్పడే వారిని గుర్తించేందుకు, అలాగే యువత మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని తెలిపే విధంగా డ్రగ్స్ కంట్రోల్ టీం అధ్వర్యంలో SAY NO TO DRUGS నినాదంతో రూపొందించిన ప్రచార గోడ పత్రికలను వరంగల్ పోలీస్ కమిషనర్ గురువారం అధికారులతో కలసి కమిషనరేట్ కార్యాలయములో అవిష్కరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, యువత భవితవ్యాన్ని కాపాడుకోవడం మనందరి ప్రధాన కర్తవ్యమని, మత్తు పదార్థాల నియంత్రణలో ప్రజలు సైతం పరోక్షంగా తమ వంతు సహకారాన్ని అందించాల్సి వుంటుందని. ఇందుకోసం ఎవరైన మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగాలకు పాల్పడితే తక్షణమే 8712584473, 8712685299 నంబర్లకు సమచారం అందించి డ్రగ్స్ రహిత సమాజంకై మీరు భాగస్వాములు కావాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా వుంచబడుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు.

ఈ కార్యక్రమములో పరిపాలన విభాగం అదనపు డిపిపి రవి, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి జితేందర్ రెడ్డి, ఆర్.ఐ శివకేశవులు, ఇన్స్‌స్పెక్టర్ సతీష్, ఆర్.ఎస్.ఐలు పూర్ణచందర్ రెడ్డి, మనోజ్ రెడ్డి,నాగరాజు, ర్యాపిడో సంస్థ ప్రతినిధులు దర్గారావు,సందీప్ పాల్గోన్నారు.

## ఎమ్మెల్సీ వాణిదేవి గారిని మాదాపూర్ లో పరామర్శించిన భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్ నవంబర్,20( సమయం న్యూస్).:** ఎమ్మెల్సీ వాణిదేవి గారు గతవారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని, వాణి దేవి గారు పూర్తిగా కోల్కున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. కేటీఆర్ వెంట పార్టీ నేతలు ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రామిరెడ్డి, తక్కళ్ళపల్లి రవీందర్ రావు, ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి, డా. సంజయ్ , పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఉన్నారు

# ఎన్నికల పరిశీలకుల నియామకం

**నిజామాబాద్, నవంబర్ 20 ( సమయం న్యూస్).** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆయా జిల్లాలకు ఎన్నికల పరిశీలకులను నియమించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లాకు ఎన్నికల సాధారణ పరిశీలకులుగా వెనుకబడిన తరగతుల సంక్షేమ పాఠశాలల ప్రత్యేక అధికారి జి.వి.శ్యాంప్రసాద్ లాల్ ను, ఎన్నికల వ్యయ పరిశీలకులుగా కామారెడ్డి జిల్లా ఆడిట్ అధికారి జె. కిషన్ పమర్ ను నియమించిందని తెలిపారు.

# సీనియర్ సిటిజన్లకు గౌరవం లభిస్తే సమాజం మరింత అభివృద్ధి

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ నవంబర్20( సమయం న్యూస్) :** సీని యర్ సిటిజన్లకు సముచిత గౌరవం లభించినప్పుడే సమాజం మరింత ప్రగతి సాధిస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా శు భాకాంక్షలు తెలిపారు. వయోవృద్ధుల సంరక్షణ కోసం ప్రభుత్వం సీనియర్ సిటిజన్ యాక్ట్ ను తీసుకురావడం జరిగిందని, ఈ చట్టంపై విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వయోవృద్ధులు తమ పూర్తి ఆస్తిని పిల్లలకు ఇవ్వకుండా కొంత భాగాన్ని తమ భద్రత కోసం ఉంచుకోవాలని సూచించారు. పిల్లలు సంరక్షణ చేయని పక్షంలో కలెక్టర్ లేదా ఆర్డీఓకు దరఖాస్తు చేసుకుంటే విచారణ జరిపి తిరిగి ఆస్తిని పొందే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో వయోవృద్ధులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. దస్నాపూర్‌లో వయోవృద్ధుల కోసం ప్రత్యేక భవనం నిర్మించి ఇంచార్జి మంత్రిచే ప్రారంభించుకున్నామని, అక్కడ డే కేర్ కేంద్రం కూడా త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల సంరక్షణ టోల్ ఫ్రీ నంబర్ పోస్టర్‌ను ఆవిష్కరించి, పలువురు వయోవృద్ధులను మెమెంటోలతో సన్మానించారు. అంతకుముందు ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును పరిశీలించి వైద్యులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, వయోవృద్ధుల సమైక్య సభ్యులు దేవిదాస్, లక్ష్మారెడ్డి, అధికారులు, వైద్యులు, వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు.



# సమిష్టి కృషే కారణం..స్ఫూర్తి దాయకం

- జిల్లా అధికారులు గా గర్వ పడుతున్నాం
- జిల్లా కి జల పురస్కారం అందిన నేపథ్యంలో....
- సంబరాలు చేసుకున్న వివిధ శాఖల అధికారులు
- కలెక్టర్, అదనపు కలెక్టర్ ని సన్మానించిన అధికారులు
- సమిష్టి కృషే కారణం
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగాం నవంబర్20( సమయం న్యూస్) :** జిల్లాకి రాష్ట్ర, కేంద్ర స్థాయి లో వివిద అంశాల్లో పలు అవార్డుల వస్తున్న నేపథ్యంలో గురువారం అన్ని శాఖల అధికారులు కలెక్టరెట్ లో సంబరాలు చేసుకున్నారుజల సంరక్షణ లో భాగం గా మన జిల్లా మన నీరు అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టి... జిల్లా, మండల, గ్రామ స్థాయి కార్యాలయల్లో ఇంకుడు గుంత లని నిర్మించి...

జిల్లా కి జల శక్తి పురస్కారం వచ్చేలా కృషి చేసి కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ మంత్రివర్యుల చేతుల మీదుగా అవార్డు తీసుకున్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ని అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు గురువారం ఘనంగా సన్మానించారు కలెక్టర్ చేత కేక్ కట్ చేపించి... తమ సంతోషాన్ని, అభిప్రాయలను పంచుకున్నారు ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు మాట్లాడుతూ.... జిల్లా లో పని చేస్తున్నందుకు మాకు గర్వం గా ఉందని... మీరు మాకు స్ఫూర్తి దాయకమని కలెక్టర్ ని కొనియాడారు

విధి నిర్వహణలో భాగం గా చాలా జిల్లాల్లో పని చేసినప్పటికి.... ఈ జిల్లా లో విధి నిర్వహణ భయం తో కాకుండా.. స్వేచ్ఛ వాతావరణం లో నిబద్దత తో, బాధ్యత యూతం గా చేసేందుకు కలెక్టర్ గారు ఇస్తున్న సహకారం మర్చిపోలేమని అధికారులు తమ అభిప్రాయన్ని తెలియజేసారు జిల్లా కి వచ్చే ప్రతి అవార్డు లో అన్ని శాఖల అధికారుల కృషి ఉంటుందని.. జిల్లా ని అన్ని అంశాల్లో రాష్ట్ర స్థాయి లో ముందంజ లో ఉంచేందుకు ఎల్లప్పుడూ అందరూ సమిష్టి గా కృషి చేయాలనీ కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు ఈ సంబరాల్లో డి ఆర్డీ ఓ వసంత, కలెక్టరెట్ ఏ ఓ శ్రీకాంత్, సీపీఓ,జిల్లా వ్యవసాయ, మార్కెటింగ్, వైద్య, ఆరోగ్య శాఖ ,అన్ని సంక్షేమ శాఖల అధికారులు, ఈ డి %౦ఎ% కార్పొరేషన్, డి ఏం, హ్యాండ్లూమ్ శాఖ తదితర శాఖ లకు చెంది న అధికారులు పాల్గొన్నారు

# సజావుగా పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలి.

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని
- 3 విడతల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం
- గ్రామపంచాయతీ ఎన్నికల సన్నద్ధత పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ఎన్నికల సంఘం కమీషనర్




**పెద్దపల్లి, నవంబర్ 20:( సమయం న్యూస్) :** గ్రామపంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని అన్నారు.గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ, ఓటర్ జాబితా తయారీ పై రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని జిల్లా కలెక్టర్ లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, డిసిపి కరుణాకర్ తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలు తొందరలో నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయించిందని, సజావుగా ఎన్నికల జరిగేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. 3 విడతల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహించాలనుకుంటే, ప్రతి ఫేజ్ లో ఏ మండలాల్లో ఎన్నికలు జరగాలో జిల్లా వారీగా ప్రణాళిక అందించాలని అన్నారు.పాత పద్ధతిలో రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుందని అన్నారు. సెప్టెంబర్ 2న విడుదల చేసిన పంచాయతీ తుది ఓటర్ జాబితా సంబంధించి ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరించి నవంబర్ 22 లోపు పరిష్కరించాలని అన్నారు. నవంబర్ 23న ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించి పోలింగ్ కేంద్రాలు, ఫోటోలతో కూడిన ఓటర్ జాబితా ప్రచురణ పూర్తి కావాలని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత ఎంసిసి నిబంధనలు తప్పనిసరిగా అనుసరించలని అన్నారు. ఎంసిసి ఉల్లంఘన పై వచ్చే ప్రతి ఫిర్యాదు పరిష్కారానికి యంత్రాంగం సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలోజెడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, ఏసిపి లు రమేష్, కృష్ణ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఐపీఎల్ ఫ్రాంచైజీలు భారీ బిడ్స్‌కు రెడీ



# నేటి నుండి యాషెస్ సిరీస్

## సిద్ధంగా ఇంగ్లాండ్- ఆస్ట్రేలియా జట్లు

## పెర్త్ వేదికగా తొలి టెస్టు ప్రారంభం

టెస్టు క్రికెట్‌లో ప్రతిష్ఠాత్మక సిరీస్ యాషెస్‌కు అంతా రెడీ అయ్యింది. ఆస్ట్రేలియా వేదికగా మరికొన్ని గంటల్లోనే ఈ సిరీస్ ప్రారంభం కానుంది. ఇంగ్లాండ్- ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే ఈ యాషెస్ టెస్టు సిరీస్‌ను క్రికెట్‌లో అతిపెద్ద టెస్టు సిరీస్‌గా అభివర్ణిస్తారు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నవంబర్ 21న పెర్త్ వేదికగా తొలి టెస్టు ప్రారంభం కానుంది. ఈసారి ఈ సిరీస్‌కు ఆస్ట్రేలియా ఆతిథ్యం ఇస్తుంది. ఇరుజట్ల ఆటగాళ్లు ఇప్పటికే నెట్స్‌లో తీవ్రంగా శ్రమిస్తున్నారు. ద్వైపాక్షిక సిరీస్‌లు ఎన్ని ఉన్నప్పటికీ, ఇరుజట్లు ఈ సిరీస్‌ను మాత్రం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటాయి. ఈ సిరీస్‌లో నెగ్గాలని తీవ్రంగా ప్రయత్నిస్తాయి. ఈ క్రమంలోనే కాంట్రవర్సీలు, ప్రత్యర్థుల మధ్య మాటల యుద్ధాలు ఇవన్నీ ఇంకొక ఎత్తు! ఇందులో బ్యాటర్ సెంచరీ చేసినా, బౌలర్ ఐదు వికెట్లు కూల్చినా ఆ ప్లేయర్ పేరు మార్మోగిపోతుంది. అలాంటి సిరీస్?కు ఆసీస్, ఇంగ్లాండ్ ప్లేయర్లు రెడీ అయ్యి, టెస్టు క్రికెట్ ఫ్యాన్స్?కు ఫుల్? మజా ఇవ్వనున్నారు. ఆస్ట్రేలియా పిచ్?లపై ఫాస్ట్ బౌలర్ల ఆధిపత్యం ఉంది. రేపు పెర్త్ స్టేడియంలో జరగనున్న యాషెస్ తొలి మ్యాచ్‌లోనూ పిచ్ పేసర్లకే సహకరించవచ్చు! అలాగే ఈ పిచ్‌పై టెస్టుల్లో ఆసీస్‌కు మంచి ట్రాక్ రికార్డ్ ఉంది. ఆతిథ్య ఆస్ట్రేలియా ఇక్కడ నాలుగు మ్యాచ్‌లు గెలిచింది. పెర్త్ స్టేడియంలో జరిగిన అన్ని టెస్ట్ మ్యాచ్‌ల్లో ముందుగా బ్యాటింగ్ చేసిన జట్టు గెలిచింది. అందుకే ఈ మ్యాచ్‌లో టాస్ కీలక పాత్ర పోషిస్తుంది. టాస్ గెలిచిన జట్టు ముందుగా బ్యాటింగ్ తీసుకనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పెర్త్ వేదికగా జరగనున్న తొలి టెస్టు ఉదయం 7:50 గంటలకు ప్రారంభమవుతుంది. దీనికి అరగంట ముందు టాస్ పడుతుంది. టీవీలో స్టార్ స్పోర్ట్స్‌కు సంబంధించిన ఛానెళ్లలో లైవ్ చూడవచ్చు. అలాగే జియో హాట్‌స్టార్ ఓటీటీలో లైవ్ స్ట్రీమింగ్ చేయవచ్చు. అయితే దీనికి సబ్‌స్క్రిప్షన్ తీలుకోవాల్సి ఉంటుంది. కానీ జియో యూజర్లకు ఎంపిక చేసిన ప్లాన్‌పై ఫ్రీగా అందిస్తోంది. కాగా, ఈ సిరీస్ 1882- 83లో ప్రారంభమైంది. అంటే దీని చరిత్ర 140 సంవత్సరాలకు పైమాటే! ఇరు దేశాలకు ఈ సిరీస్ ప్రతిష్ఠాత్మకం. ఇప్పటిదాకా యాషెస్‌లో 73 సిరీస్‌లు జరిగాయి. చివరిసారిగా 2023లో సిరీస్ జరిగింది. అప్పుడు ఆస్ట్రేలియా విజేతగా నిలిచింది. ఓవరాల్‌గా ఆసీస్ 34సార్లు నెగ్గగా, ఇంగ్లాండ్ 32 సార్లు సిరీస్‌లో దక్కించుకుంది. 7 సిరీస్‌లు డ్రా గా ముగిశాయి. ఇక టెస్టుల విషయానికొస్తే, 364 టెస్టు మ్యాచ్‌ల్లో ఆసీస్- ఇంగ్లాండ్ తలపడ్డాయి. ఇందులోనూ ఆస్ట్రేలియా ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తుంది. ఆసీస్ 152 టెస్టుల్లో విజయం సాధించగా, ఇంగ్లాండ్ 112 మ్యాచ్‌ల్లో నెగ్గింది. మరో 97 మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. ఇంగ్లాండ్ జట్టు: బెన్ డకెట్, జాక్ క్రాలే, ఓల్లీ పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్ (కెప్టెన్), జేమీ స్మిత్ (వికెట్ కీపర్), గస్ అట్కిన్సన్, జోఫ్రా ఆర్చర్, మార్క్ వుడ్, బ్రైడాన్ కార్సే, షోయబ్ బషీర్, జాకబ్ బెథెల్, మాథ్యూ పాట్స్, జోష్ టోంగ్, విల్ జాక్స్ ఆస్ట్రేలియా జట్టు : ఉస్మాన్ ఖవాజా, జేక్ వెదరాల్, మార్నస్ లాబుషేన్,స్టీవ్ స్మిత్ (కెప్టెన్), ట్రావిస్ హెడ్, కామెరాన్ గ్రీన్, అలెక్స్ కేరీ (వికెట్ కీపర్), మిచెల్ స్టార్క్, నాథన్ లియాన్, బ్రెండన్ డాగెట్, స్కాట్ బోలాండ్, బ్యూ వెబ్‌స్టర్, జోష్ ఇంగ్లిస్, మైఖేల్ నెసెర్

## పలువురు స్టార్ ప్లేయర్ల కోసం సిద్ధం

అబుదాబిలో డిసెంబర్ 16న ఐపీఎల్ 2026 మినీ వేలం జరగనుంది. ఇక పలువురు స్టార్ ప్లేయర్ల కోసం.. ఐపీఎల్ ఫ్రాంచైజీలు భారీ బిడ్స్‌కు రెడీ అవుతున్నాయి. అయితే ఈసారి చాలా మంది ఆటగాళ్లు వేలంలోకి వస్తుండగా.. వారిపై భారీ ధర పలికే ఛాన్స్ ఉంది. ఇప్పటివరకూ ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధరకు అమ్ముడైన రిషబ్ పంత్ రికార్డును కూడా బద్దలు కొట్టేందుకు.. ఓ ముగ్గురు ప్లేయర్లు లైన్‌లో సిద్ధంగా ఉన్నారు. ఐపీఎల్ 19వ సీజన్ వేలం డిసెంబర్ 16న అబుదాబిలో జరగనుంది. అయితే ఇది మినీ వేలం కావడంతో ఒకే రోజులో క్లోజ్ అవ్వనుంది. కామెరాన్ గ్రీన్ నుండి ఆండ్రీ రస్సెల్ వరకు.. పలువురు స్టార్ ఆటగాళ్ల కోసం ఐపీఎల్ ఫ్రాంచైజీలు భారీ బిడ్లకు సిద్ధమవుతున్నాయి. పంత్ పేరు మీదున్న రూ. 27 కోట్ల రికార్డు కూడా చెరిగే అవకాశం ఉంది. ఈ వేలంలో అందరి కంటే ముందున్న ఆటగాడు.. ఆస్ట్రేలియాకు చెందిన విధ్వంసక ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్. ఐపీఎల్ 2026 మినీ వేలంలోకి కామెరాన్ కూడా రానున్నాడు. ఐపీఎల్ 2024లో ఈ ప్లేయర్‌ని ఆర్సీబీ..ముంబై ఇండియన్స్ నుండి రూ. 17.5 కోట్లకు ట్రేడ్ చేసుకుంది. అయితే ఐపీఎల్ 2025 సీజన్‌లో కామెరాన్ గ్రీన్ గాయం కారణంగా ఆడలేకపోయాడు. కానీ ఈసారి ఫుల్ ఫామ్‌తో తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో మెగా వేలంలో ఈ ఆటగాడి కోసం ఫ్రాంచైజీల మధ్య గట్టి పోటీ ఉండబోతోంది. కామెరాన్ గ్రీన్‌పై రూ. 25 కోట్ల వరకు బిడ్ పడే అవకాశం ఉంది. ఇక 2014 ఐపీఎల్ నుండి



కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున ఆడుతున్న ఆండ్రీ రస్సెల్‌ను..ఈసారి రిలీజ్ చేయడంతో మినీ వేలంలోకి రాబోతున్నాడు. గత సీజన్‌లో ఈ ఆల్‌రౌండర్‌ను మెగా వేలంలో రూ. 12 కోట్లు చెల్లించి రిటైన్ చేసుకున్నారు. బ్యాట్, బాల్ రెండింటితోనూ మ్యాచ్‌ను మలుపు తిప్పగల సామర్థ్యం ఇతని సొంతం. అందువల్ల ఆండ్రీ రస్సెల్‌పై భారీ బిడ్ పడే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. గత సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడిన శ్రీలంక ఫాస్ట్ బౌలర్ మతీష పతిరానాను.. ఈసారి విడుదల చేసింది. ఐపీఎల్ 2025లో మతీషను రూ. 13 కోట్లు చెల్లించి రిటైన్ చేసుకున్నారు. ఈ సూపర్ బౌలర్‌కు డెత్ ఓవర్లలో వికెట్లు తీయగల అద్భుతమైన సామర్థ్యం ఉంది. మతీష పతిరానాపై కూడా రూ. 10 కోట్ల వరకు బిడ్ పడే ఛాన్స్ ఉంది.

# ఐపీఎల్ 19వ సీజన్‌కు రంగం సిద్ధం

## అబుదాబిలో డిసెంబర్ 16న వేలం

క్రికెట్ ప్రేమికులకు పండగలాంటి వార్త ఇది. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఐపీఎల్ 19వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. రాబోయే ఐపీఎల్ 2026 కోసం మినీ వేలం వచ్చే నెల జరగనుంది. దీనికి సంబంధించిన తేదీ, వేదిక వివరాలను బీసీసీఐ తాజాగా ప్రకటించింది. ఈసారి వేలాన్ని విదేశాల్లోని అబుదాబిలోని ఎతిహాద్ అరేనాలో డిసెంబర్ 16న నిర్వహించనున్నారు. మినీ వేలానికి ముందు 10 జట్లు కలిసి మొత్తం 173 మంది ఆటగాళ్లను రిటైన్ చేసుకున్నాయి. వీరిలో 49 మంది విదేశీ ఆటగాళ్లు ఉన్నారు. ఫ్రాంచైజీలు కొనుగోలు చేయడానికి ఇంకా 77 స్లాట్‌లు మిగిలి ఉన్నాయి. అన్ని జట్ల పర్సులలో కలిపి మొత్తం రూ.237.55 కోట్ల డబ్బు వేలంలో అందుబాటులో ఉంది. ఐపీఎల్ నిబంధనల ప్రకారం.. ఒక జట్టులో గరిష్టంగా 25 మంది ఆటగాళ్లు ఉండవచ్చు. పంజాబ్ కింగ్స్ 21 మందిని, గుజరాత్ టైటాన్స్, ముంబై ఇండియన్స్ చెరో 20 మందిని ఇప్పటికే రిటైన్ చేసుకున్నాయి. ఫ్రాంచైజీల వద్ద మిగిలిన డబ్బు లెక్కల ప్రకారం.. కోల్‌కతా నైట్ రైడర్స్ వద్ద అత్యధికంగా రూ.64.3 కోట్లు ఉన్నాయి. వీరు ఏకంగా 13 మంది ఆటగాళ్లను కొనుగోలు చేయవచ్చు. ఆండ్రే రసెల్, వెంకటేశ్ అయ్యర్ వంటి ఖరీదైన ఆటగాళ్లను కేకేఆర్ విడుదల చేయడం దీనికి కారణం. మరోవైపు, సన్‌రైజర్స్ హైదరాబాద్ పర్స్‌లో రూ.25.5 కోట్లు మిగిలాయి. అయితే ముంబై ఇండియన్స్ మాత్రం అతి తక్కువ మొత్తంతో వేలానికి వెళ్తోంది. ఆ జట్టు వద్ద కేవలం రూ.2.75 కోట్లు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ వేలం ద్వారా కేకేఆర్ తమ జట్టును దాదాపు కొత్తగా నిర్మించుకోవడానికి మంచి అవకాశం ఉంది.

# ఓర్వలేకనే గంభీర్‌పై విమర్శలు

## బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ అండగా నిలిచాడు. కొందరు అతని ఎదుగుదలను ఓర్వలేకనే గంభీర్‌పై విమర్శలు గుప్పిస్తున్నారని తెలిపాడు. కోల్‌కతా వేదికగా సౌతాఫ్రికాతో జరిగిన తొలి టెస్ట్‌లో టీమిండియా 30 పరుగుల తేడాతో ఓటమిపాలైన సంగతి తెలిసిందే. 124 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక టీమిండియా ఓటమిపాలైంది. పూర్తిగా స్పిన్‌కు అనుకూలంగా ఉన్న వికెట్‌పై భారత బ్యాటర్లు బంతిని డిఫెండ్ చేయలేకపోయారు. దాంతో పిచ్ క్యురేటర్‌పై విమర్శలు వచ్చాయి. అయితే క్యురేటర్ తప్పిదం లేదని, తాము కోరిన పిచ్‌నే ఇచ్చాడని మ్యాచ్ అనంతరం గంభీర్ స్పష్టం చేశాడు. తమ బ్యాటర్లే పిచ్ కండిషన్స్‌కు తగ్గట్లు ఆడలేకపోయారని తెలిపాడు. దాంతో గంభీర్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. గంభీర్ అనాలోచిత నిర్ణయాల కారణంగానే టీమిండియా ఓటమిపాలైందనే అభిప్రాయం వ్యక్తమైంది. గౌహతి వేదికగా శనివారం నుంచి రెండో టెస్ట్ ప్రారంభం కానుండగా.. బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ గురువారం మీడియాతో మాట్లాడాడు. ఈ సందర్భంగా గంభీర్‌పై వచ్చిన విమర్శలను తిప్పి కొట్టిన సితాన్షు కోటక్.. కొందరు పనిగట్టుకొని తమ హెడ్ కోచ్‌పై విమర్శలు గుప్పిస్తున్నారని అభిప్రాయపడ్డాడు.'క్యురేటర్‌పై విమర్శలు రావద్దనే గౌతమ్ గంభీర్ ఆ నిందను తనపై వేసుకున్నాడు. ఇతర దేశాలు కూడా వారి సొంతగడ్డపై తమ బలాలకు అనుగుణంగా ఉండే పిచ్‌లనే తయారు చేసుకుంటాయి. మేం కూడా సొంతగడ్డపై ఆడేటప్పుడు స్పిన్ పిచ్‌లపై ఆధారపడుతాం. స్పిన్నర్లకు కొంత సాయం లభించేలా నాలుగు, నాలుగున్నర రోజుల పాటు ఆట సాగే పిచ్‌లను ఆశిస్తాం. తొలి రెండు రోజులు పేసర్లకు సహకరించే పిచ్‌లను కోరుకుంటాం. తొలి టెస్ట్ పరాజయం అనంతరం జనాలు కేవలం గౌతమ్ గంభీర్ గురించే మాట్లాడుతున్నారు. బ్యాటర్ల వైఫల్యం గురించి కానీ బ్యాటింగ్ కోచ్ పనితీరును కానీ ప్రస్తావించడం లేదు. భారత్ ఓడిన ప్రతీసారి గంభీర్‌పైనే విమర్శలు వస్తున్నాయి. బహుషా గంభీర్ పట్ల కొంతమందికి వారి సొంత ఎజెండాలు ఉండవచ్చు. పనిగట్టుకొని విమర్శలు చేస్తున్నారు. ఇది చాలా తప్పు. కోల్‌కతా వంటి పిచ్‌లపై రాణించాలంటే బ్యాటర్ల ఫుట్‌వర్క్ బాగుండాలి. బౌలర్లు లెంగ్త్‌ను సరిగ్గా అంచనా వేయగలిగితే ఎలాంటి పిచ్‌పై అయినా రాణించగలరు. మరీ డిఫెన్స్ ఆడితే కూడా ఔటయ్యే ప్రమాదం ఉంటుంది. ఎందుకంటే బౌలర్లు స్థిరమైన ప్రదేశాల్లో బౌలింగ్ చేస్తూనే ఉంటారు. మేం మ్యాచ్‌కు ముందు కొన్ని విషయాలను మాత్రమే చర్చించగలం. ఎవరో ఒకరు రిస్క్ తీసుకోవాలి. మరొకరు బిజీ క్రికెట్ ఆడాలని మాత్రమే మాట్లాడుకుంటాం.'అని సితాన్షు కోటక్ చెప్పుకొచ్చాడు.



# బంగారు పతకానికి కూతవేటు దూరంలో..

## ప్రపంచకప్ ఫైనల్‌లో బాక్సర్ నిఖత్ జరీన్

ప్రపంచ బాక్సింగ్ కప్ 2025 టోర్నీలో భారత మహిళా బాక్సర్ నిఖత్ జరీన్ ఆధిపత్యాన్ని చలాయిస్తుంది. ఇప్పటికే రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన నిఖత్ జరీన్.. ఇప్పుడు మరోసారి ఫైనల్‌కు చేరి బంగారు పతకానికి కూతవేటు దూరంలో నిలిచింది. గురువారం జరిగిన పోరులో గెలిచి తుదిపోరుకు చేరడం ద్వారా నిఖత్ జరీన్ పతకాన్ని ఖాయం చేసుకుంది. మహిళల 51 కేజీల విభాగంలో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో బరిలో దిగిన నిఖత్ జరీన్.. ఉజ్బెకిస్థాన్ బాక్సర్ గనీవా గుల్సెవర్‌ను మట్టికరిపించింది. బాక్సింగ్ న్యాయనిర్ణేతలు అందరూ ఆమెను ఏకగ్రీవంగా విజేతగా ప్రకటించారు. దీంతో ప్రపంచ బాక్సింగ్ కప్ 2025 టోర్నీ ఫైనల్లో నిఖత్.. చైనీస్ తైపీకి చెందిన గువో జి జువాన్‌తో బంగారు పతకం కోసం పోటీ పడనుంది. ఈ సందర్భంగా తెలంగాణకి చెందిన బాక్సర్ నిఖత్ జరీన్ మాట్లాడింది. “చాలా ఏళ్ల తర్వాత మళ్లీ నాకు మెడల్ దక్కడం హ్యాపీగా ఉంది. రాబోయే రోజుల్లో ఇదే విధంగా ముందుకు సాగుతా. గతంలో సొంత గడ్డపై ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచా. ఇప్పుడు ఈ టోర్నీ సెమీఫైనల్‌లో గెలిచి.. ఫైనల్‌లో గోల్డ్ మెడల్ సాధిస్తానని ధీమాగా ఉన్నా”నని నిఖత్ జరీన్ చెప్పుకొచ్చారు. ప్రపంచ బాక్సింగ్ కప్ ఛాంపియన్‌షిప్‌లో ఇప్పటి వరకు ఐదుగురు బాక్సర్లు ఫైనల్ చేరారు. వారిలో 57 కిలోల విభాగం సెమీస్‌లో జాస్మిన్ 5-0తో కజకిస్థాన్‌కు చెందిన సర్సెన్బెక్‌పై నెగ్గింది. 57 కిలోల విభాగంలో జాదుమణి సింగ్, 55 కిలోల విభాగంలో పవన్ బర్త్వాల్, 60 కిలోల విభాగంలో సచిన్ సివాచ్, 70 కిలోల విభాగంలో హితేశ్ గులియా కూడా ఫైనల్లో అడుగుపెట్టారు.

# వన్డే సిరీస్‌కు టీమిండియా కెప్టెన్‌గా రాహుల్!

## దక్షిణాఫ్రికా వన్డేతో రోహిత్, కోహ్లీ పునరాగమనం



భారత్ -దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న టెస్ట్ సిరీస్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. మొదటి టెస్ట్ 30 పరుగుల తేడాతో ఓడిపోయిన తర్వాత, టీమ్ ఇండియా ఇప్పుడు నవంబర్ 22 నుంచి గౌహతిలో రెండో టెస్ట్ ఆడనుంది. దీని తరువాత, రెండు జట్లు నవంబర్ 30 నుంచి ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో తలపడనున్నాయి. వన్డే సిరీస్ కోసం బీసీసీఐ ఎలాంటి జట్టును సిద్ధం చేస్తుందో చాలా పేర్లు బయటకు వచ్చాయి. ఈసారి చాలా పెద్ద పేర్ల పునరాగమనం చర్చను మరింత పెంచింది. వన్డే సిరీస్‌కు కెప్టెన్సీ కెఎల్ రాహుల్‌కు దక్కే అవకాశం ఉంది. శుభ్‌మన్ గిల్ గాయం కారణంగా ఆడటం అనుమానంగా ఉంది. అటువంటి పరిస్థితిలో, రాహుల్‌ను కెప్టెన్‌గా నియమించడం దాదాపు ఖాయం. భారత్, దక్షిణాఫ్రికా మధ్య వన్డే మ్యాచ్‌లు నవంబర్ 30, డిసెంబర్ 3, డిసెంబర్ 6 తేదీల్లో జరగనున్నాయి. చాలా కాలం తర్వాత వన్డేల్లో భారత్ ఇద్దరు దిగ్గజ ఆటగాళ్ళు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఒకేసారి కనిపించారు. ఆస్ట్రేలియాతో జరిగిన ఇటీవలి వన్డే సిరీస్‌లో రోహిత్ అద్భుత ప్రదర్శన చేశాడు. ప్రారంభ మ్యాచ్‌లో తక్కువ పరుగులు చేసిన తర్వాత, అతను రెండో వన్డేలో అర్ధ సెంచరీ, మూడవ మ్యాచ్‌లో అద్భుతమైన సెంచరీ సాధించి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డును గెలుచుకున్నాడు. విరాట్ కోహ్లీ కూడా తన క్లాస్‌తో అందరినీ ఆకట్టుకున్నాడు. మొదటి రెండు మ్యాచ్‌ల్లో విఫలమైన తర్వాత, అతను మూడవ వన్డేలో 74 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి భారత్‌ను గెలిపించాడు. ఛేజింగ్‌లో తనకంటే గొప్పవారు లేరని మరోసారి నిరూపించాడు. దక్షిణాఫ్రికాతో జరిగే మ్యాచ్‌లో ఈ జోడీ జట్టుకు రన్ మెషిన్ అవుతుందని భావిస్తున్నారు. ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా ఆసియా కప్‌లో గాయపడిన తర్వాత ఇప్పుడు పూర్తిగా కోలుకున్నాడు. అతని రాక టీమ్ ఇండియా బ్యాలెన్సింగ్‌ను మరింత బలోపేతం చేస్తుంది. హార్దిక్ బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ ముఖ్యమైన పాత్ర పోషిస్తాడు. వేగవంతమైన బౌలర్ జస్ప్రీత్ బుమ్రాకు ఆస్ట్రేలియాతో జరిగిన %వాణ×% సిరీస్‌లో విశ్రాంతి ఇచ్చారు, కాని ఇప్పుడు అతను కూడా వన్డే సిరీస్‌లో తిరిగి రావచ్చు. అతని ఉనికి భారత బౌలింగ్‌కు పదును పెడుతుంది. అదేవిధంగా, దేశవాళీ క్రికెట్‌లో నిరంతరం పరుగులు సాధిస్తున్న రుతురాజ్ గైక్వాడ్‌కు కూడా జట్టులో చోటు దక్కే అవకాశం ఉంది. అతని ఫామ్, స్థిరత్వం జట్టుకు పెద్ద ప్లస్ పాయింట్.



# రజనీకి హెచ్‌టి అత్యున్నత గౌరవం

## 50 ఏళ్ల సినీ ప్రస్థానంపై ఫ్రంట్ పేజీలో ఫోటో

అగ్ర కథానాయకుడు రజనీకాంత్‌కు అరుదైన గౌరవం దక్కింది. ప్రముఖ ఆంగ్ల పత్రిక హిందుస్థాన్ టైమ్స్ ఫ్రంట్ పేజీలో ఆయన ఫొటోను ముద్రించారు. ఈ పత్రిక స్థాపించిన వందేళ్లలో ఇలా ఒక పేజీ మొత్తం హీరో ఫొటోను ముద్రించడం తొలిసారి కావడం విశేషం. రజనీకాంత్ ఇండస్ట్రీకి వచ్చి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా హిందుస్థాన్ టైమ్స్ తలైవాను ఇలా గౌరవించింది. సినీ ఇండస్ట్రీని ఎంతో ప్రభావితం చేసిన వ్యక్తికి ఇలాంటి గౌరవాన్ని కల్పించడం ఆనందంగా ఉందని పత్రిక పేర్కొంది. నవంబర్ 19న పేపర్‌లో రజనీ ఫొటో చూసి పాఠకులు ఆశ్చర్యపోయారు. ఇది ఆయనకు ఇచ్చిన గొప్ప గౌరవం అంటూ ఆనందం వ్యక్తంచేశారు. దీనిపై రజనీకాంత్ కూడా స్పందించారు. అద్భుతమైన సర్‌ప్రైజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన హృదయం ఆనందంతో నిండిపోయిందన్నారు. తనపై చూపుతోన్న ప్రేమాభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. 1975లో 'అపూర్వ రాగంగళ్'తో సినీ రంగప్రవేశం చేసిన రజనీకాంత్ ఎన్నో హిట్ సినిమాల్లో నటించి తన స్టైల్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కోట్ల మంది అభిమానులను సొంతం చేసుకున్నారు. ఈ నెలలో గోవా వేదికగా జరగనున్న 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి - 2025) ముగింపు వేడుకల్లో రజనీకాంత్‌ను సన్మానించనున్నారు.

# అలా చేస్తే నష్టమే

## ఏఐ మార్ఫింగ్ ఫోటోలు ప్రమాదకరం

## ఆందోళన వ్యక్తం చేసిన నటి కీర్తి సురేశ్

తన పేరుతో ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ అవుతున్న ఏఐ మార్ఫింగ్ చిత్రాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది అగ్ర కథానాయిక కీర్తి సురేష్. డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా రూపొందించబడిన ఈ నకిలీ ఫోటోలు తనను మానసికంగా బాధిస్తున్నాయని కీర్తి తెలిపింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది. మార్ఫింగ్ చిత్రాలు నా మనసుకి చాలా బాధ కలిగించడమే కాకుండా.. చాలా విసుగు పుట్టిస్తున్నాయి. ఈ కృత్రిమ మేధస్సుతో క్రియేట్ నకిలీ చిత్రాలు ఎంత నమ్మేలా ఉన్నాయంటే వాటిని చూసినప్పుడు నిజంగానే నేను అలా ఫోజు ఇచ్చానా? అని తనకు తాను ప్రశ్నించుకునే పరిస్థితి వచ్చిందని కీర్తి పేర్కొన్నారు. ఇది ఏఐ సాంకేతికత ఎంత ప్రమాదకరంగా మారిందో తెలియజేస్తుందని కీర్తి తెలిపారు. ఏఐ సాంకేతికత సామర్థ్యాలు నానాటికీ పెరుగుతున్నాయని వీటిని నియంత్రించడం కష్టంగా మారుతోందని కీర్తి సురేష్ ఆందోళన వ్యక్తం చేశారు. తమ అనుమతి లేకుండా తమ ఇమేజ్‌లను దుర్వినియోగం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని. ఈ సమస్య కేవలం సినీ పరిశ్రమకు మాత్రమే పరిమితం కాలేదని సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఉండే ఎవరికైనా ఇది ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని కీర్తి హెచ్చరించారు. ఇక కీర్తి సురేష్ ఆవేదనకు మద్దతుగా నటి ఆండ్రియా జెరెమియా కూడా ఎఐ వల్ల కలిగే నష్టాల గురించి మాట్లాడారు. నటులకే కాదు, సామాన్య ప్రజలకు కూడా ఏఐ సమస్యగా మారుతోంది. రష్మిక మందన్న, సమంత వంటి పలువురు నటీమణులు కూడా ఇలాంటి డీప్‌ఫేక్ లేదా మార్ఫింగ్ చిత్రాల బారిన పడ్డారు. ఇప్పుడు కీర్తి సురేష్ కూడా దీనిపై గళం విప్పడం, ఎఐ దుర్వినియోగం పై మరింత కఠినమైన చట్టాలు తీసుకురావాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.






# అమీర్‌పేట్ సెంటర్‌లో అర్ధనగ్నంగా తిరుగుతా!

## రాజు వెడ్స్ రాంబాయి డైరెక్టర్ సాయిలు

అఖిల్ రాజ్, తేజస్వి రావు జంటగా నటించిన 'రాజు వెడ్స్ రాంబాయి' నవంబర్ 21న శుక్రవారం రిలీజ్‌కి సిద్ధం అవుతోంది. ఈటీవీ విన్ ఒరిజినల్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమాకు సాయిలు కంపాటి స్టోరీ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం స్వయంగా నిర్వహించారు. ఇప్పటికే విడుదలైన ప్రతి అప్‌డేట్ మంచి అంచనాలు తీసుకొచ్చింది. అయితే తాజాగా జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సాయిలు చేసిన కామెంట్స్ మాత్రం టాలీవుడ్‌లో పెద్ద చర్చగా మారాయి. మా సినిమా చిన్నదైనా, దాని వెనక ఉన్న ఎమోషన్ చాలా పెద్దది. పల్లెటూరి కథలు, అమాయకమైన ప్రేమ, ఊర్లో జరిగే నిజ జీవిత సంఘటనలు నాకు తెలుసు. నేను విమానం నుంచి దిగి వచ్చే హీరోల కథలు రాయలేదు. మన దగ్గర జరిగిన నిజమైన కథను తీసుకొచ్చా. ఈ సినిమా 15 ఏళ్ల పాటు నరకం చూసిన ఒక జంట నిజ జీవితాన్ని ఆధారంగా చేసుకున్నదని దర్శకుడు చెప్పారు. అలాగే సోషల్ మీడియాలో నెగిటివ్ ప్రచారం చేయొద్దు, సినిమా నచ్చకపోతే వదిలేయండని అభిమానులకు కోరుతూ.. మా టీమ్ ఎంత కష్టపడిందో మీకు సినిమా చూస్తే అర్థమవుతుంది. మన కష్టానికి తగిన ఫలితం తప్పకుండా వస్తుందని అంటూ విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే సోషల్ మీడియాలో నెగిటివ్ ప్రచారం చేయొద్దని కోరుతూ.. 'ఈ సినిమాకు నెగెటివ్ టాక్ వస్తే అమీర్‌పేట్ సెంటర్‌లో అర్ధనగ్నంగా తిరుగుతా!' అని ప్రకటించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. సినిమా టీమ్ కష్టాన్ని నమ్మి ఇలాంటి ఛాలెంజ్ చేస్తున్నానని చెప్పారు. సాయిలు కంపాటి స్టేట్‌మెంట్ నేపథ్యంలో ఇప్పుడు అందరి దృష్టి సినిమాపైనే పడింది.



# కళ్యాణి ప్రియదర్శి కొత్త చిత్రం ప్రారంభం

కళ్యాణీ ప్రియదర్శన్ ఇవాళ మలయాళ చిత్ర సీమలో స్టార్ హీరోయిన్. అగ్ర కథానాయకుల సినిమాలను మించి పోయి... ఆమె నటించిన 'లోకా' పార్ట్ వన్ 300 కోట్లకు పైగా గ్రాస్‌ను వసూలు చేసింది. దీంతో ఒక్కసారిగా సెట్స్ మీద ఉన్న ఆమె సినిమాలకు క్రేజ్ పెరిగిపోయింది. ప్రస్తుతం కార్తీ సరసన 'మార్షల్' సినిమాలోనూ, 'జయం' రవి 'జీనీ'లోనూ ఆమె నటిస్తోంది. అలానే 'లోకా' మూవీ సక్సెస్ తర్వాత కళ్యాణీ ప్రియదర్శన్ తో సినిమా తీయడానికి చాలామంది మేకర్స్ తహతహలాడుతున్నారు. ఇదిలా ఉంటే... పొటెన్షియల్ స్టూడియోస్ సంస్థ తన ఏడో సినిమాను కళ్యాణ్ ప్రియదర్శన్ తో మొదలు పెట్టింది. గతంలో 'మాయ, మానగరం, మాన్ స్టర్, తానక్కరన్, ఇరుగపాత్రు, బ్లాక్' వంటి విజయవంతమైన సినిమాలను ఈ నిర్మాణ సంస్థ రూపొందించింది. ఈ సినిమాలో 'నాన్ మహానల్లా' ఫేమ్ దేవదర్శిని, వినోద్ కిషన్ కీలక పాత్రలు పోషించబోతున్నారు. ఈ మూవీతో ధీరవియం ఎస్.ఎన్. దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ప్రవీణ్ భాస్కర్, శ్రీకుమార్ దీనికి దర్శకుడితో కలిసి స్క్రీన్ ప్లే, సంభాషణలు అందిస్తున్నారు. జస్టిన్ ప్రభాకరన్ సంగీతం అందిస్తుండగా, గోకుల్ బెనోయ్ సినిమాటోగ్రాఫర్ గా వ్యవహరిస్తున్నారు. ఎస్ఆర్ ప్రకాష్ బాబు, ఎస్ఆర్ ప్రభు, పి. గోపీనాథ్, తంగప్రభహరన్ ఆర్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చెన్నైలో పూజా కార్యక్రమాలతో బుధవారం ప్రారంభమైంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని అప్‌డేట్స్ త్వరలోనే ప్రకటించనున్నారు.



# జయకృష్ణ మూవీకి జివి సంగీతం

సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేశ్ బాబు తనయుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా టాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతున్న విషయం తెలిసిందే. జయకృష్ణను హీరోగా పరిచయం చేస్తూ ప్రముఖ నిర్మాత అశ్వినీదత్ సమర్పణలో 'జెమినీ' కిరణ్ మూవీని ప్రొడ్యూస్ చేస్తున్నారు. దీనికి 'ఆర్.ఎక్స్. 100' ఫేమ్ అజయ్ భూపతి దర్శకుడు. అజయ్ భూపతి 'ఆర్.ఎక్స్. 100' తర్వాత 'మహాసముద్రం', 'మంగళవారం' చిత్రాలను రూపొందించారు. దర్శకుడిగా ఇది ఆయనకు నాలుగో సినిమా. జయకృష్ణ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో అతని సరసన ప్రముఖ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ హీరోయిన్ గా నటిస్తోంది. గతంలో రవీనా టాండన్ పలు తెలుగు చిత్రాలలో హీరోయిన్ గా చేసింది. రాషాకు మాత్రం ఇదో తొలి తెలుగు సినిమా. ఇక తాజాగా ఈ సినిమాకు జీవీ ప్రకాశ్ కుమార్ ను సంగీత దర్శకుడిగా ఎంపిక చేసినట్టు మేకర్స్ తెలిపారు. అజయ్ భూపతి గతంలో దర్శకత్వం వహించిన సినిమాలకు చైతన్ భరద్వాజ్, అజనీశ్ లోకనాథ్ సంగీతం అందించారు. జీవీ ప్రకాశ్ కుమార్‌తో అజయ్ భూపతి వర్క్ చేయడం ఇదే మొదటిసారి. గడిచిన 19 సంవత్సరాలలో జీవీ ప్రకాశ్ కుమార్ వందకు పైగా సినిమాలకు సంగీతాన్ని అందించాడు. తెలుగులోనూ పలు చిత్రాలకు స్వరాలు సమకూర్చాడు. అయితే జయకృష్ణ హీరోగా పరిచయం కాబోతున్న సినిమాకు అతను సంగీతాన్ని అందించడం ప్రత్యేకతను సంతరించుకుంది. మరి ఈ సినిమా ఏ స్థాయిలో మ్యూజికల్ హిట్ గా నిలుస్తుందో చూడాలి.



Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131